ప్రజాశక్తి

సోమవారం 26 ఫిబ్రవరి 2024 8 పేజీలు

ప్రకాశం

బాపట్ల

పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రశాంతంగా గ్రూప్-2 పరీక్షలు

- కలెక్టర్ దినేష్ కుమార్
- పలు కళాశాలల్లో కలెక్టర్, జెసి పరిశీలన

8లో

ఒంగోలులో వికలాంగురాలిని ఎత్తుకొని పరీక్షా కేంద్రానికి తీసుకొస్తున్న హోంగార్డు రమణమ్మ

ముంచిన తాలుకాయలు

- వరుస నష్టాలతో మిర్చి రైతులకు కష్టాలు
- పెట్టుబడి కూడా రాదని ఆవేదన

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

మిరప రైతులు వరుసగా మూడేళ్ల నుంచి పంట నష్టం ఎదుర్కొంటున్నారు. ఈ సారి కూడా మిచౌంగ్ తుపాన్ మిరప పంటను మింగేసింది. ప్రస్తుతం మిరప కోతలు ఊపందుకున్నాయి. నాణ్యత కంటే తాలు ఎక్కువగా ఉందని భావించి కొందరు రైతులు గ్రేడింగ్ చేయించడం లేదు. పెట్టుబడి కూడా రాదని అన్నదాతలు వాపోతున్నారు. రెండేళ్ల క్రితం నల్ల తామర, గతేడాది భారీ వర్షాలతో నష్టపోయారు. ఈ ఏడాది తీవ్రమైన బెట్ట పరిస్థితులను అధిగమించి సాగునీరు కొనుగోలు చేసి తోటలకు నీటి తడులు అందించారు. పంట దిగుబడి సమయానికి వచ్చిన తుపాన్ సాగుదారులను కోలుకోకుండా చేసింది.

యర్రగొండపాలెం నియోజకవర్గంలోని యర్రగొండపాలెం మండలంలో 5300 ఎకరాలు, పుల్లలచెరువు మండలంలో 4700 ఎకరాలు, త్రిపురాంతకం మండలంలో 4650 ఎకరాలు, పెద్దారవీడు మండలంలో 4400 ఎకరాలు, పెద్దదోర్నాల మండలంలో 4500 ఎకరాలు మొత్తం వెరసి 23,550 ఎకరాలలో ఈ ఏడాది మిరప పంటను సాగు చేశారు.



మిర్చి తాలుకాయలు

సానుకూలంగా ఉంటే ఎకరాకు 25 నుంచి 30 క్వింటాళ్ల దిగుబడి లభిస్తుంది. ఈ ఏడాది 10 నుంచి 15 క్వింటాళ్ల దిగుబడి గగనమేనని రైతులు తెలిపారు. ఇక మిరప ధరలు కూడా పతనమయ్యాయి. గతేడాది డిసెంబరు వరకు ప్రధాన మార్కెట్‌లో క్వింటాలు మిరప ధర రూ.24 వేల వరకు ఉంది. జనవరిలో ధర గణనీయంగా పడిపోయి రూ.19 వేలు ఉంది. ప్రస్తుతం రూ. 15 వేలకు మించి పలకడం లేదు. తాలు కాయల ధర రూ.10 వేల నుంచి రూ.8 వేలకు తగ్గిపోయింది. రైతులకు పెట్టుబడులకు ఎకరాకు రూ. 1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు వ్యయమైంది. నికరాదాయం ఆశలు నీరుగారాయని వాపోయారు.

కూలి దండగని గ్రేడింగ్ చేయించలేదు

దుగ్గినేని ఓం నారాయణ, మిరప రైతు, వాదంపల్లి

ఐదు ఎకరాల్లో మిరప సాగు చేశా.. ఎకరాకు రూ. 1.50 లక్షలు పెట్టుబడి పెట్టాను. రెండో కోత కోస్తున్నా.. ఎకరాకు 6 క్వింటాళ్ల వరకు దిగుబడి అవ్వగా 80 శాతం తాలుకాయ ఉంది. మరో నాలుగైదు క్వింటాళ్ల దిగుబడి లభిస్తుంది. కూలి దండగని భావించి గ్రేడింగ్ కూడా చేయించడం లేదు. తుపాను నిలువునా ముంచేసింది. ప్రభుత్వం నుంచి పరిహారం అందలేదు.

డ్రైనేజీపై అక్రమ నిర్మాణాలు

- ఓఎంసి పాలకవర్గ పెద్దల ఆశీస్సులతో యథేచ్ఛగా కట్టడాలు
- కొత్త కూరగాయల మార్కెట్ చుట్టూ రెచ్చిపోతున్న అక్రమార్కులు

అక్రమంగా నిర్మిస్తున్న షాపులు

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

మురుగు కాల్వయినా.. పది మందీ నడిచే రోడ్డయినా.. ఆక్రమణకు కాదేది అనర్హం అంటున్నారు ఒంగోలు నగరంలో అక్రమార్కులు. తాజాగా నగరంలోని ఊరచెరువులో ఉన్న దామోదరం సంజీవయ్య కొత్త కూరగాయాల మార్కెట్‌కు సమీపంలో ఉన్న మురుగు కాల్వపై ఆక్రమ కట్టడాలు వెలిశాయి. గత నాలుగైదు రోజులుగా కొంతమంది వ్యక్తులు ఇక్కడ నగరపాలక సంస్థ డ్రైనేజీ స్థలాన్ని ఆక్రమించి యథేచ్ఛగా షాపులు కడుతున్నారు. కాల్వను కాంక్రీట్‌తో కప్పేసి దానిపై వరుసగా షాపులు నిర్మిస్తున్నారు. అక్రమాలు జరుగుతున్నది ఊరచెరువు ప్రాంతం. ఆక్రమిత ప్రాంతానికి వెనుక వైపు అంతా కార్పొరేషన్ స్థలాలు, ఆఫీసులు, కార్పొరేషన్ పారిశుధ్య కార్మికుల మస్టర్ పాయింట్ కూడా ఉంది. అలాంటి ప్రదేశంలో నగరానికి నడిబొడ్డున్న డ్రైనేజీని ఆక్రమించి కట్టడాలు చేస్తుంటే నగరపాలక సంస్థ అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు.

పాలకవర్గ పెద్దలే చెప్పారంట..

ఈ ఆక్రమణలను నగరపాలక సంస్థ పాలకవర్గ పెద్దలే ప్రోత్సహిస్తున్నట్లు తెలిసింది. ఇక్కడ ఎవరు మిమ్మల్ని షాపులు కట్టుకోమన్నారని ఆక్రమణదారులను ప్రశ్నిస్తే పాలకవర్గ పెద్దలే ఇక్కడ షాపులు కట్టుకోమన్నారని ఆక్రమణదారులు బహిరంగంగానే చెబుతున్నారు. తమకు షాపులు పెట్టుకునేందుకు ఎక్కడైనా స్థలం చూపించాని పెద్దలని కోరామని, అందుకు వారు డ్రైనేజీ మీద కట్టడాలు చేసుకోవాలని చెప్పారని వారు చెబుతున్నారు.

కాపాడాల్సిన వారే కబ్జాలను ప్రోత్సహిస్తూ..

ఒంగోలు నగరంలో కార్పొరేషన్‌కు చెందిన కాల్వలు, రోడ్లు కాపాడాల్సిన బాధ్యత నగరపాలక సంస్థ పాలకవర్గం, అధికారులపై ఉంది. అలాంటి పాలవర్గ పెద్దలే మున్సిపాలిటీ డ్రైనేజీని మూసేసి కట్టడాలు చేసుకోమని చెప్పడం పట్ల తీవ్ర స్థాయిలో విమర్శలు వినిపిస్తున్నాయి. విశ్వసనీయవర్గాల సమాచారం ప్రకారం.. ఇక్కడ డ్రైనేజీపై కడుతున్న షాపుల నుంచి మధ్యవర్తులు కొంతమంది పాలకవర్గ పెద్దల పేరు చెప్పి కొంత డబ్బు వసూలు చేశారని తెలిసింది. అందుకే మున్సిపాలిటీ కాలువపై యథేచ్ఛగా ఆక్రమణలు జరుగుతున్నా అధికారులు కూడా పట్టించుకోలేదని సమాచారం. కాపాడాల్సిన 2లో

మార్కెట్‌లో షాపులు కేటాయించాలి

జి.రమేష్, పట్టణ పౌర సంఘాల సమాఖ్య కన్వీనర్

ఊరచెరువులో డ్రైనేజీని ఆక్రమించి కట్టడాలు చేయడం సరికాదు. డ్రైనేజీని కప్పేసి షాపులు కట్టుకోవాలని పాలకవర్గ నేతలు చెప్పడం దుర్మార్గం. ఇది చట్ట విరుద్ధం కూడా.. ఎవరైనా సరే డ్రైనేజీ మీద కట్టడాలు ఆక్రమణల కిందకే వస్తుంది. కూరగాయల మార్కెట్‌లో అనేక షాపులు ఖాళీగా ఉన్నాయి. పాలకవర్గ నేతలకు జాలి ఉంటే స్వయం ఉపాధి కోరుకొనే వాళ్లకి అక్కడ షాపులు కేటాయించాలి. వారి జీవనోపాధికి అధికారికంగా తోడ్పాటునందించాలి. అంతేగానీ మురుగు కాల్వను కప్పేస్తే భవిష్యత్తులో వర్షాలు వచ్చినప్పుడు అనేక ఇబ్బందులు వస్తాయి.

'మున్సిపాలిటీ'లోనూ

మార్పు తప్పదా.?

- 'చిర్లంచెర్ల'కు ఎన్నికలకు ముందే ఉద్వాసన.!
- చైర్మన్‌గా డాక్టర్ కనకదుర్గకు అవకాశం.?
- ఎమ్మెల్యే రాంబాబు చెంతకు 'పంచాయితీ'..

ప్రజాశక్తి-మార్కాపురం

ఎన్నికల వేళ విజయం కోసం వైసిపి అధిష్టానం క్షేత్ర స్థాయిలో దృష్టి సారిం చింది. స్థానిక సంస్థల్లో పదవుల మార్పిడితో ఆ పార్టీలో అంతర్గతంగా బలాన్ని కూడ గట్టుకునే పనిలో వైసిపి శ్రేణులు నిమగ్న మయ్యారు. అందులో భాగంగా మార్కాపురం మున్సిపాలిటీలోనూ చైర్మన్ పదవిపై ఎక్కుపెట్టారు. చైర్మన్ పీఠం కోసం జరుగుతున్న పంచాయితీ గిద్దలూరు ఎమ్మెల్యే, మార్కాపురం నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త అన్నా వెంకటరాంబాబు పంచకు చేరింది. చైర్మన్ పీఠంపై మళ్లీ కూర్చొనేది ఎవరో అని మార్కా'పుర'ం ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.!

మార్కాపురం మున్సిపాలిటీలో మొత్తం 35 వార్డులు ఉన్నాయి. అందులో 30 వార్డుల్లో వైసిపి కౌన్సిలర్లు ఎన్నికయ్యారు. కేవలం ఐదు వార్డుల్లో మాత్రమే టిడిపి కౌన్సిలర్లు ఎన్నికయ్యారు. వైసిపి ప్రభుత్వం ఏర్పడిన తరువాత కరోనా కాలంలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో వైసిపి తరుపున మున్సిపల్ చైర్మన్ పీఠాన్ని చిర్లంచెర్ల బాలమురళీక్రిష్ణ, డాక్టర్ చెప్పల్లి కనకదుర్గ ఆశించారు. ఎన్నికల వ్యయం కూడా ఇద్దరూ భరించారు. అప్పట్లో చైర్మన్ పీఠంపై ముందు తానంటే తామని ఇద్దరూ పోటీ పడ్డారు. ఆ సమయంలో మార్కాపురం ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి వద్ద పంచాయితీ పెట్టారు. తొలి విడతలో రెండున్నర సంవత్సరాల కాలం చైర్మన్ పదవిలో ఆర్యవైశ్య సామాజిక వర్గానికి చెందిన చిర్లంచెర్ల బాలమురళీక్రిష్ణకు అవకాశం ఇచ్చేలా నిర్ణయించారు. ఆ తరువాత కాలంలో డాక్టర్ చెప్పల్లి కనకదుర్గ కొనసాగేలా అప్పట్లో ఒప్పందం జరిగింది. డాక్టర్ కనకదుర్గ 2014-19 కాలంలో టిడిపి ప్రభుత్వం హయాంలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లోనూ డాక్టర్ కనకదుర్గ పోటీలో నిలిచారు. డాక్టర్ కనకదుర్గ కౌన్సిలర్‌గా ఎన్నికయ్యారు. అప్పుడు 2లో

బాలమురళీకృష్ణ

కనకదుర్గ

గ్రామాభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తా..

మంత్రి నాగార్జున

ప్రజాశక్తి-సంతనూతలపాడు

గురువారెడ్డిపాలెం గ్రామ అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తానని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగు నాగార్జున అన్నారు. మండలంలోని గురవారెడ్డిపాలెంలో ఆదివారం రాత్రి జరిగిన పాలశీతలీకరణ భవనం వైఎస్సార్ విలేజ్ క్లినిక్, ఆర్‌బికెలను ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో మంత్రి నాగార్జున మాట్లాడుతూ మండలంలో కెల్లా అత్యధిక మెజార్టీ ఇచ్చిన గురువారెడ్డిపాలెం గ్రామ అభివృద్ధికి తన వంతు విశేష కృషి చేస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. గ్రామంలో వేణుగోపాలస్వామి ఆలయ అభివృద్ధికి సంబంధిత అధికారులతో మాట్లాడతానని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో తనను ఆదరించి మంచి మెజార్టీకి కృషి చేయాలని, మళ్లీ జగన్మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేయడానికి అందరూ కృషి చేయాలని కోరారు. ముందుగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత వాడలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్ల ర్పించారు. రూ.17.67 లక్షలతో నిర్మించిన పాల శీతలీకరణ భవనానికి రూ.20.80 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ విలేజ్ క్లినిక్ భవనాన్ని రూ.23.94 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాలను ఆయన ప్రారంభించారు. అనంతరం గ్రామస్తులతో గ్రామ సచివాలయం వద్ద పరిచయ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

ఆర్‌బికెను ప్రారంభిస్తున్న మంత్రి నాగార్జున

ఈ సందర్భంగా భవనాలన్నింటికీ 16 సెంట్లు స్థలాన్ని బొమ్మిరెడ్డి రామిరెడ్డి జ్ఞాపకార్థం ఇచ్చిన నలమాలపు అంజిరెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మారెడ్డి విజయలక్ష్మి, ఎంపిటిసి కంచి మాధవి, గ్రామ వైసిపి అధ్యక్షుడు మారెడ్డి పవన్‌కుమార్ రెడ్డి, వైసిపి మండల అధ్యక్షుడు దుంపా చెంచిరెడ్డి, జడ్పిటిసి దుంపా రమణమ్మ, ఎంపిపి బి విజయ, వైస్ ఎంపిపి టి రాగమ్మ, ఎస్ఎన్ పాడు సర్పంచ్ దర్శి నాగమణి దుమా పీడి కే శీనారెడ్డి, ఏపీడి పి వెంకటస్వామి, మెడికల్ ఆఫీసర్ పి హరిణి, పిఆర్ ఏఈ పి రవిబాబు, గ్రామ కార్యదర్శి కే ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జంకె వెంకటరెడ్డి

వైసిపి గెలుపే లక్ష్యం

ఎపిఐఐసి చైర్మన్ జంకె వెంకటరెడ్డి

ప్రజాశక్తి-మార్కాపురం

రాష్ట్రంలో సిఎంగా మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సేవలు అవసరమని, అన్ని వర్గాలకు సమన్యాయం అందిస్తున్న సిఎం జగన్‌కు అండగా నిలిచేందుకు మార్కాపురం ఎమ్మెల్యేగా అన్నా వెంకటరాంబాబును వచ్చే ఎన్నికల్లో గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని ఎపిఐఐసి చైర్మన్ జంకె వెంకటరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక కాలేజీ రోడ్డులోని సెవెన్ హిల్స్ ఫంక్షన్ హాలులో మార్కాపురం మండలంలోని ముఖ్య నాయకులు, ప్రజా ప్రతినిధులతో ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మాజీ ఎంపిపి పోరెడ్డి అరుణ చెంచిరెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జంకె వెంకటరెడ్డి మాట్లాడారు. వైసిపి ప్రభుత్వంలో అర్హులందరికీ న్యాయం జరిగిందని, సచివాలయ వ్యవస్థతో పాలన మరింత దగ్గరైందని అన్నారు. వాలంటీర్ల సేవలు నేరుగా ఇంటి వద్దకు చేరాయన్నారు. ఎమ్మెల్యే అన్నా వెంకటరాంబాబు మాట్లాడుతూ తాను నిస్వార్థంగా పనిచేస్తున్నానని అన్నారు. ప్రజలకు సేవ చేసేందుకు రాజకీయాల్లో కొనసాగుతున్నానని చెప్పారు. కష్టపడే కార్యకర్తలకు అండగా నిలుస్తానని భరోసా ఇచ్చారు. సమావేశంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ డాక్టర్ మీర్జా షంషీర్ అలీ బేగ్, మాజీ ఎఎంసి చైర్మన్ గొలమారి శ్రీనివాసరెడ్డి, వాల్మీకి రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ నలబోతుల కొండయ్య, కెపి సోదరుడు కుందురు వెంకటరెడ్డి, జడ్‌పిటిసి నారు బాపన్‌రెడ్డి, వైసిపి నాయకులు బండి కృష్ణారెడ్డి, వైసిపికి చెందిన సర్పంచులు, ఎంపిటిసిలు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

నా పట్ల వివక్ష చూపిస్తున్నారు..

ఎఎంసి చైర్మన్ సాల్మన్ రాజు

ప్రజాశక్తి-కనిగిరి

మాట్లాడుతున్న సాల్మన్‌రాజు

తనపై వివక్ష చూపుతూ, ప్రొటోకాల్ పాటించకుండా తనను అవమానిస్తున్నారని కనిగిరి ఎఎంసీ చైర్మన్ చింతకుంట సాల్మన్‌రాజు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన తన కార్యాలయంలో నిర్వ హించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కొంతమంది అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రభుత్వ కార్యక్రమాలకు తనను ఆహ్వానించడం లేదన్నారు. ప్రొటోకాల్ పాటించకుండా వివక్ష చూపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం తాను ఎస్సీ సామాజికవర్గమని తనను చిన్నచూపు చూస్తూ అవమాన పరుస్తున్నారని పేర్కొన్నారు. ఉన్నతాధికారులు చొరవచూపి ప్రొటోకాల్ పాటించేలా ప్రభుత్వ కార్యక్రమాల్లో తాను పాల్గొనేలా చర్యలు చేపట్టాలని ఎఎంసి చైర్మన్ చింతకుంట్ల సాల్మన్‌రాజు కోరారు.

ఉరేసుకొని బాలిక ఆత్మహత్య

ప్రజాశక్తి-దర్శి

ఉరేసుకొని బాలిక ఆత్మహత్య చేసుకున్న ఘటన దర్శి పట్టణంలోని లంకోయినపల్లి రోడ్డులో ఆదివారం జరిగింది. చెరుకూరి వీరనారాయణ కుమార్తె చంద్రిక (13) స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏడో తరగతి చదువుతోంది. ఆదివారం బాలిక ఇంట్లో ఉరేసుకున్నట్లు కుటుంబసభ్యులు గమనించారు. 108 ద్వారా స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే బాలిక మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

మీడియాపై దాడులు అప్రజాస్వామికం: సిపిఎం

ప్రజాశక్తి-కనిగిరి

మీడియాపై అధికార పార్టీ దాడులు అప్రజాస్వామికమని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జివి కొండారెడ్డి అన్నారు. స్థానిక సుందరయ్య భవనంలో ఆదివారం సాయంత్రం సిపిఎం కనిగిరి పట్టణ కమిటీ సమావేశం జి శ్రీనివాసులు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ మోహన్‌రెడ్డి నచ్చని పత్రికలపై బహిరంగంగా మాట్లడటం మొదలుపెట్టిన తర్వాత దిగువ స్థాయి నాయకులు పార్టీ శ్రేణులు కూడా మాట్లడటం, దాడులకు పాల్పడటం వంటి చర్యలకు పాల్పడుతున్నారన్నారు. పత్రికలు అనుసరిస్తున్న విధానాలు నచ్చకపోతే పత్రికతో మాట్లాడి

మాట్లాడుతున్న జివి.కొండారెడ్డి

పరిష్కరించుకోవాలి తప్ప సిబ్బందిపై దాడులకు పాల్పడటం ప్రజాస్వామిక వ్యవస్థలో సరైనది కాదని విమర్శించారు. సమావేశంలో సిపిఎం కనిగిరి పట్టణ కార్యదర్శి పీసీ కేశవరావు, నాయకులు ఏడుకొండలు, బషీర్, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

'డ్రైనేజీ'పై అక్రమ నిర్మాణాలు

(మొదటిపేజీ తరువాయి)

వారే ఆక్రమణలను ప్రోత్సహిస్తుండటం విశేషం. ఆక్రమిత స్థలం ఊరచెరువులో భారీ డ్రెయిన్. వర్షాలు వచ్చి నప్పుడు నగరంలోని అనేక ప్రాంతాల నుంచి ఈ డ్రైనేజీ లోంచే నీరు పారుతోంది. అలాంటి డ్రైనేజీ ఆక్రమణకు గురై తే, భవిష్యత్తులో వర్షాలు, వరదలు వచ్చినప్పుడు ఇబ్బందులు తప్పవు. ఈ కనీస విషయాన్ని కూడా పరిగణ లోకి తీసు కోకుండా నేతలు ఆక్రమణలను ప్రోత్సహించడం గమనార్హం. పైగా డ్రెయినేజీ మీద షాపులు కడుతుండటంతో ఈ షాపుల వద్దకు వచ్చే వారి వాహనాలు రోడ్డుమీదనే పెట్టుకోవాల్సిన పరిస్థితి. ట్రాఫిక్ సమస్యలు కూడా ఉత్పన్నం అవుతాయి.

మార్కెట్‌లో షాపులు ఖాళీగా ఉన్నా..!

ప్రస్తుత డ్రైనేజీ ఆక్రమిత ప్రాంతానికి నాలుగడుగుల దూరంలో కొత్త కూరగాయల మార్కెట్ ఉంది. ఈ మార్కెట్‌లో సుమారు 50కి పైగా షాపులు ఖాళీగా ఉన్నాయి. పాలకవర్గ పెద్దలకు నిజంగా వికలాంగులపై అంత ప్రేమ ఉంటే ఆ షాపులను వారి జీవనోపాధి కోసం తక్కువ అద్దెలకు కేటాయించొచ్చు. లేదా మార్కెట్‌లో ఆకుకూరల వ్యాపారుల కోసం గతంలో ఏర్పాటు చేసిన అనేక షెడ్‌లు కూడా ఖాళీగా ఉన్నాయి. అక్కడైనా వారికి కేటాయించొచ్చు. అలాంటిదేమీ చేయకుండా మురుగు కాల్వను ఆక్రమించుకోమని పాలకవర్గ పెద్దలు ప్రోత్సహించడం పట్ల పలు అనుమానాలు రేకెత్తుతున్నాయి. డ్రైనేజీని మూసేసి దాదాపు 20 షాపులు కడుతున్నారు. ఈ షాపుల నిర్మాణం వెనుక పెద్ద మొత్తంలో డబ్బులు చేతులు మారాయని ఊరచెరువులోని పలువురు వ్యాపారులు చర్చించుకుంటున్నారు.

'మున్సిపాలిటీ'లోనూ మార్పు తప్పదా.?

(మొదటిపేజీ తరువాయి)

కౌన్సిలర్లు వైసిపి నుంచి పది మంది మాత్రమే గెలిచారు. టిడిపి కౌన్సిలర్లు పూర్తి మెజార్టీతో ఉండటంతో చైర్మన్ పీఠాన్ని టిడిపి నుంచి వక్కలగడ్డ రాధిక మల్లికార్జున దక్కించుకున్నారు. అప్పట్లో డాక్టర్ కనకదుర్గ ప్రతిక్ష కౌన్సిల్ నాయకురాలిగా ఉండిపోవాల్సి వచ్చింది. వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత వార్ వన్‌సైడ్ జరిగినా డాక్టర్ కనకదుర్గకు అవకాశం ముందుగా దక్కలేదు. ప్రస్తుతం చైర్మన్ పదవిలో కొనసాగడం ముందుగా కుదుర్చుకున్న అంగీకారం ప్రకారం ముగియడంతో ఆ పదవిపై డాక్టర్ కనకదుర్గ దృష్టి పెట్టారు. మార్కాపురంలోని ఎమ్మెల్యే అన్నా వెంకటరాంబాబు నివాసంలో ఆదివారం సాయంత్రం డాక్టర్ కనకదుర్గతో పాటు మున్సిపల్ చైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీకృష్ణను కూర్చోబెట్టి పంచాయితీ నడిపారు. ఏమి జరిగిందనేది ఇంకా తెలలేదు. మరో రెండు, మూడు రోజుల్లో పంచాయితీ తేలే అవకాశం లేకపోలేదని వైసిపిలో చర్చ నడుస్తోంది.

వైసిపిలో రెడ్డి సామాజికవర్గం బలంగా ఉంది. ఎమ్మెల్యే సీటును ఆర్యవైశ్య సామాజికవర్గానికి చెందిన అన్నా వెంకటరాంబాబుకు ఇవ్వడంతో మున్సిపల్ చైర్మన్‌గా రెడ్డి సామాజిక వర్గానికి ఇవ్వాలని రెడ్డి సామాజికవర్గం పట్టుబడుతోంది. డాక్టర్ చెప్పల్లి కనకదుర్గ రెడ్డి సామాజికవర్గం కావడంతో చైర్మన్‌గా కలిసి వచ్చే కాలమని వైసిపి నేతలు అంటున్నారు.

మాట్లాడుతున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

సమస్యల పరిష్కారం కోసమే 'మన ఊరికి మన శివన్న'

ప్రజాశక్తి-దర్శి

గ్రామాల్లో సమస్యలు పరిష్కరించడమే తమ లక్ష్యమని జిల్లా పరిషత్ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే, వైసిపి ఇన్‌ఛార్జి బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని బసిరెడ్డిపల్లి, లింగన్నపాలెం గ్రామాల్లో మన ఊరికి మన శివన్న కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికీ తిరిగి వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని తెలిపారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థ గొప్ప చరిత్ర సృష్టించిందని, వాలంటీర్ వ్యవస్థ ద్వారా రాష్ట్ర ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ పథకాలు ఇంటి వద్దకే చేరుతున్నాయని అన్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు పొత్తు కోసం ఎదురు చూస్తున్నారని విమర్శించారు. గ్రామ సర్పంచ్ మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు కీసరి రామ్‌భూపాల్‌రెడ్డి, జిల్లా ఎంపిటిసిల సంఘం అధ్యక్షులు బండి గోపాల్, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ సానికొమ్ము తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించారు. గ్రామంలో పెద్దఎత్తున ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు వెన్నపూస వెంకటరెడ్డి, కార్పొరేషన్ డైరెక్టర్లు ఎస్ఎం బాషా, కమ్మిత అంజిరెడ్డి, మాజీ ఎంపిటిసి కీసరి శ్రీనివాసరెడ్డి, మాజీ సర్పంచ్ చింతలపూడి శ్రీనివాసరెడ్డి, ఇరుగుల వెంకటరెడ్డి, తుమ్మెదలపాడు సర్పంచ్ శేషిరెడ్డి, గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

లయన్స్ క్లబ్ సేవలు అమోఘం

ప్రజాశక్తి-దర్శి

లయన్స్‌క్లబ్ సేవలు అమోఘమని దర్శి మాజీ ఎమ్మెల్యే, వైసిపి ఇన్‌ఛార్జి బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అన్నారు. ఆదివారం దర్శి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం స్థానిక పీజీఎన్ కాంప్లెక్స్ కళ్యాణ మండపంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ లయన్స్‌క్లబ్ సేవలు మరువలేనివని అన్నారు. ఈ కార్యక్రమంలో వంకా రవీంద్రనాథ్, విజయ్‌కుమార్‌రెడ్డి పాల్గొని నూతన కార్యవర్గం చేత ప్రమాణ స్వీకారం చేయించారు. అధ్యక్షులుగా పి ఫణిబాబు, వైస్ ప్రెసిడెంట్‌గా కే శివరామిరెడ్డి, పి వెంకటసుబ్బయ్య, సెక్రటరీగా సత్యనారాయణగుప్తా, జాయింట్ సెక్రటరీగా పాపిరెడ్డి, ట్రెజరర్‌గా జి అశోక్‌లు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సాగర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాలంటీర్లకు తాయిలాలు!

రూ.5 వేలు, స్వీటు ప్యాకెట్ పంపిణీ చేసిన అన్నా

ప్రజాశక్తి-పొదిలి

మార్కాపురం నియోజకవర్గంలో అధికారపార్టీ ఆర్థికంగా ముందుండటంతో ఎత్తులు, పైఎత్తులకు శ్రీకారం చుట్టారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి 'మార్పు' పేరుతో మార్కాపురం, గిద్దలూరు నియోజవర్గాల శాసనసభ్యులను అటు ఇటు మార్చి కొత్త ఆటకు శ్రీకారం చుట్టిన అధికార పార్టీ గెలుపే లక్ష్యంగా ముందుకు పోయేందుకు అవసరమైన అన్ని రకాల ఏర్పాట్లు చేసుకుంటోంది. పశ్చిమ ప్రాంతంలో రాజకీయ విన్యాసాలకు మారుపేరుగా మారిన గిద్దలూరు శాసనసభ్యులు అన్నా రాంబాబు తాను వయోభారంతో వైదొలుగుతున్నట్లు ప్రకటించినా ముఖ్యమంత్రి జగన్ ఆయనను మార్కాపురంలో బరిలోకి దింపారు. ఒక దశలో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామంటూ మీడియా ముందు ఏకరువు పెట్టిన అన్నా గోడు జగనన్న వినలేదా లేక పథకం ప్రకారం ఇక్కడ దించారా అనేది అర్థం కావడంలేదని ఈ నియోజకవర్గ ప్రజలు భావిస్తున్నారు. ఆరు నూరైనా టిక్కెట్ తమకే అంటూ చివరి వరకు బీరాలు పలికిన కుందురు కుటుంబం చివరికి అధినేత ఆటలో గిద్దలూరు వెళ్లారు. గిద్దలూరులో 15 సంవత్సరాలుగా వివిధ పార్టీలలో చక్రం తిప్పి గత ఎన్నికల్లో ముఖ్యమంత్రి తరువాత అత్యధికంగా 82 వేల భారీ మెజార్టీతో గెలిచిన రాంబాబు ఐదేళ్లలో అక్కడి నుంచి బయటకు రావాల్సి వచ్చింది. రాజకీయాల నుంచి విశ్రాంతి తీసుకుంటానని చెప్పిన ఆయన మార్కాపురం నియోజకవర్గంలో రెట్టింపు ఉత్సాహంతో ముందుకుపోతున్నారు. ఈ క్రమంలో శనివారం పొదిలి పట్టణ శివారులోని ఒక కళాశాల ఆవరణలో పొదిలి, కొనకనమిట్ల మండలాల వాలంటీర్లకు తాయిలాలు పంచారు. ప్రతి 50 కుటుంబాలకు ఒక వాలంటీరు ఉండగా ఆయా కుటుంబాల సమగ్ర సమాచారం వీరి చేతుల్లో ఉంది. పార్టీలకు అతీతంగా స్వచ్ఛందంగా (వాలంటీర్ అంటే స్వచ్ఛందం) సేవలు అందించే వారిని ముందుగా తమ కనుసన్నల్లో ఉంచుకునేందుకు వాలంటీర్లకు ఒక్కొక్కరికి ఐదు వేల నగదుతో పాటు మిఠాయి ప్యాకెట్లు పంపిణీ చేసినట్లు సమాచారం. ఈ విషయం ఆ నోటా ఈ నోటా పడి పొదిలి ప్రాంతంలో చర్చనీయాంశంగా మారింది. ఇంకా నోటిఫికేషన్ వెలువడలేదు... నామినేషన్ వేయలేదు.. అప్పుడే అధికార పార్టీ తాయిలాలకు తెరలేపడంతో ఈసారి ఎన్నికల్లో డబ్బు ప్రవాహం ఎలా ఉంటుందో అనే చర్చ జరుగుతోంది. పార్టీకి వీర విధేయులుగా ముద్రపడిన వాలంటీర్లు గత ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీలను మించి పని చేస్తున్నారని రాబోయే ఎన్నికలకు వీరు పార్టీని విజయం ఒడ్డుకు చేర్చుతారనే నమ్మకం అధినేత మదిలో ఉంది.

గ్యాస్ లీకై హోటల్ దగ్ధం

రూ. 50 వేల ఆస్తి నష్టం

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

పెద్దదోర్నాలలోని గుంటూరు జాతీయ రహదారిపై ఉన్న రామావత్ కృష్ణానాయక్ హోటల్‌లో ఆదివారం గ్యాస్ స్టౌవ్ లీకై హోటల్ దగ్ధమైంది. హోటల్‌లో గ్యాస్ సిలిండర్లు, సామగ్రి, నిత్యావసర సరుకులు కాలిపోయాయి. రూ.50 వేల ఆస్తి నష్టం జరిగింది. పెద్దదోర్నాల అగ్నిమాపక క్షేత్రాధికారి నహీం ఆధ్వర్యంలో మంటలను అదుపులోకి తెచ్చారు. భారీ ప్రమాదం జరగకుండా చర్యలు చేపట్టారు.

మట్టి ఖర్చులకు నగదు అందజేస్తున్న దృశ్యం

వీఆర్‌ఏ అంకయ్య మృతికి సంతాపం

ప్రజాశక్తి-టంగుటూరు

మండలంలోని మర్లపాడు గ్రామంలో రెవెన్యూ సహాయకులుగా విధులు నిర్వర్తిస్తున్న దార్ల పిల్ల అంకయ్య(89) అనారోగ్యంతో శనివారం అర్ధరాత్రి మృతి చెందారు. ఆదివారం సమాచారం తెలుసుకున్న రెవెన్యూ సిబ్బంది దార్ల అంకయ్య భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఇన్‌ఛార్జి తహశీల్దారు జె శ్రీనాథ్ ఆదేశాల మేరకు గ్రామ రెవెన్యూ అధికారి తెలగతోటి కుముద్‌బెన్‌జోషి మర్లపాడు గ్రామంలోని వీఆర్‌ఏ నివాసానికి వెళ్లి పిల్ల అంకయ్య భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. మట్టి ఖర్చులు నిమిత్తం రూ.10 వేలను వీఆర్వో జోషి విఆర్‌ఏ అంకయ్య కుటుంబ సభ్యులకు అందజేశారు. అదేవిధంగా వీఆర్‌ఏ కుటుంబానికి రెవెన్యూ శాఖ ద్వారా రావలసిన ప్రయోజనాలను త్వరలోనే అందజేస్తామని జోషి పేర్కొన్నారు. మృతుడు దార్ల అంకయ్యకు ఇద్దరు కుమారులు ఉన్నారు. అంకయ్య భౌతిక కాయాన్ని సందర్శించిన వారిలో సిబ్బంది ఏటి రాఘవయ్య, గ్రామస్తులు ఉన్నారు.

దేవస్థానానికి ఒంటె వాహనం బహూకరణ

ప్రజాశక్తి-చీమకుర్తి

స్థానిక తూర్పుపాలెంలోని అభయాంజనేయస్వామి దేవస్థానానికి అభయకళారాధన అధ్యక్షులు మద్దాళి మాధవరావు అంజలీదేవి దంపతులు ఊరేగింపు ఒంటె వాహనం బహూకరించారు. ఆదివారం స్థానిక ఆలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాధవరావు మాట్లాడుతూ తమ తల్లిదండ్రులు, కుమారుడు పవన్‌కుమార్ జ్ఞాపకార్థం వాహనాన్ని బహూకరించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మాధవరావు దంపతులను ఆలయ కమిటీ సభ్యులు జి అలివేలు మంగమ్మ, పి వెంకటేశ్వర్లు, కోటయ్య, సాంబయ్య, ఆంజనేయులు, వరలక్ష్మమ్మ, రామారావు, వెంకాయమ్మ, సుబ్బారావు తదితరులు సన్మానించారు.

ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెంలో మోటారు మెకానిక్‌గా పనిచేస్తున్న షేక్ శిలార్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న యర్రగొండపాలెం నియోజకవర్గ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్ ఆదివారం శిలార్ ఇంటికి వెళ్లారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్యుల సలహాలు పాటించాలని కోరారు. రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఒంగోలు మూర్తిరెడ్డి, ఎంపిపి దొంతా కిరణ్ గౌడ్, జడ్పిటిసి చేదూరి విజయభాస్కర్, మాజీ ఏఎంసి చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ కొప్పర్తి ఓబుల్‌రెడ్డి, నర్రెడ్డి వెంకటరెడ్డి, ఒంగోలు సుబ్బారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ రవీంద్రను కలిసిన ఎరిక్షన్‌బాబు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ఎరిక్షన్‌బాబు, రవీంద్రలను సన్మానిస్తున్న అభిమానులు

యర్రగొండపాలెం నియోజకవర్గ టిడిపి అభ్యర్థిగా గూడూరి ఎరిక్షన్‌బాబును అధిష్టానం ప్రకటించడంతో ఎరిక్షన్‌బాబు ఆదివారం డాక్టర్ మన్నె రవీంద్రను ఆయన స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలువు రు టిడిపి నాయకులు శాలువతో వారిద్దరినీ ఘనంగా సత్కరించారు. ఉత్తరం, దక్షిణం ధృవాలుగా ఉన్న ఇద్దరూ కలిసిపోవడంతో ఎరిక్షన్‌బాబు విజయం ఖాయమని కార్యకర్తలు సంతోషం వెలిబుచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు వేములకొండ శ్రీనివాస్, మండల కన్వీనర్లు చేకూరి సుబ్బారావు, పయ్యావుల ప్రసాద్, నాయకులు వేగినాటి శ్రీనివాస్, పాలడుగు వెంకట కోటయ్య, కొత్త భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

'చదలవాడ' కృషి అభినందనీయం

ఘనంగా ప్రబంధ యుగకర్త ఎర్రాప్రగడ గ్రంథావిష్కరణ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

మహాకవి ఎఱ్ఱనను ప్రబంధ యుగకర్తగా నిరూపిస్తూ ప్రముఖ కవి చదలవాడ లక్ష్మీ నరసింహారావు ప్రబంధ యుగకర్త ఎర్రాప్రగడ అనే పరిశోధనాత్మక గ్రంథాన్ని వెలువరించడం అభినందనీయమని గురుసహస్రావధాని డాక్టర్ కడిమిళ్ల వరప్రసాద్ పేర్కొన్నారు. పద్య సారస్వత పరిషత్తు ప్రకాశం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఒంగోలులో బ్రాహ్మణ సేవా సమితి కమ్యూనిటీ హాలులో ఎర్రాప్రగడ గ్రంథ ఆవిష్కరణ కార్యక్రమంలో డాక్టర్ కడిమిళ్ల వరప్రసాద్ పాల్గొని గ్రంథ సమీక్ష నిర్వహించారు. సభకు పద్య సారస్వత పరిషత్తు ప్రకాశం జిల్లా శాఖ అధ్యక్షులు మాగంటి శ్రీరామమూర్తి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ వైస్ ప్రెసిడెంట్ మేనేజింగ్ డైరెక్టర్ జీవీ సుబ్బారెడ్డి, బ్రిటానియా కంపెనీ విశ్రాంత అధికారి చదలవాడ బాబా, నాగభైరవ కళాపీఠం అధ్యక్షులు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ, నరసం రాష్ట్ర గౌరవ అధ్యక్షురాలు టి అరుణ, పద్య సారస్వత పరిషత్తు నెల్లూరు శాఖ అధ్యక్షులు పోలవరపు నరసింహారావు, సృజన అధ్యక్షులు గాడేపల్లి దివాకరదత్తు, సృజన పూర్వ అధ్యక్షులు పుట్టంరాజు శ్రీరామ చంద్రమూర్తి, ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు పొన్నూరు వేంకట శ్రీనివాసులు, విశ్వకళా భారతి అధ్యక్షులు నాదెండ్ల జ్వాలా ఉమామహేశ్వరశర్మ, అక్షర సాహితీ సమితి అధ్యక్షులు ఎంవిఎస్ శాస్త్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా చదలవాడ లక్ష్మీ నరసింహారావు దంపతులను పలువురు కవులు, అభిమానులు సన్మానించారు.

2 అద్దంకిలో బహిరంగ సభ

ప్రజాశక్తి-పొదిలి

ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి జిల్లాల రాష్ట్ర పర్యటనలో భాగంగా ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌ఎఫ్, అనుబంధ సంఘాల ఉమ్మడి ప్రకాశం జిల్లాల బహిరంగ సభ మార్చి 2వ తేదీన అద్దంకిలో జరుగుతుందని, ఈ కార్యక్రమానికి మందకృష్ణ మాదిగ హాజరవుతున్నారని ఆయా సంఘాల నాయకులు తెలిపారు. ఈ సాయంత్రం 4గంటలకు అద్దంకి బంగ్లా రోడ్‌లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. ఆదివారం స్థానిక బాప్టిస్టుపాలెంలో కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ మండల అధ్యక్షుడు సురేష్ మాదిగ, తాళ్లూరి రామారావు, గుర్రం మల్లికార్జున, వై కిరణ్ కుమార్, గాలిముట్టి రమేష్, వేల్పుల ఎలీషాబాబు, ఆరోను, జాన్, అజయ్, అంథోని, దిలీప్, జోసెఫ్, మోజెష్, అచ్చియ్య, మోషే తదితరులు పాల్గొన్నారు.

యర్రగొండపాలెం: ఉమ్మడి ప్రకాశం జిల్లా అద్దంకి పట్టణంలో మార్చి 2వ తేదీన జరిగే ఎంఆర్‌పిఎస్ సభను జయప్రదం చేయాలని యర్రగొండపాలెం నియోజకవర్గ ఎంఆర్‌పిఎస్ అధ్యక్షులు చేదూరి సుబ్బయ్య తెలిపారు. ఆదివారం యర్రగొండపాలెంలోని చర్చి సెంటర్‌లో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుబ్బయ్య మాట్లాడుతూ ముఖ్య అతిథులుగా దేవరపల్లి భిక్షాలు, బొంత ఏసుదాసు, కత్తి ఐజక్, జాలారావు, కోటేశ్వరరావు, జీవరత్నం, కుమార్, వెంకటేష్, కాశీరావు, నవీన్, ప్రకాశం పాల్గొంటారని తెలిపారు. కృష్ణ మాదిగ పిలుపు అందుకొని ప్రతి ఒక్కరూ అద్దంకి సభకు హాజరై వర్గీకరణ విషయంలో ప్రస్తుతం జరుగుతున్నా పరిణామాలు, సుప్రీంకోర్టులో జరిగిన ఎస్సీ వర్గీకరణ వాదనలు తెలియజేయనున్నట్లు తెలిపారు.

కండువా కప్పి.. పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఉగ్ర

విశ్వబ్రాహ్మణులకు ప్రాధాన్యం కల్పించాలి

ప్రజాశక్తి-గిద్దలూరు

రాష్ట్ర జనాభాలో సుమారు 15 లక్షల ఓటర్లు ఉన్న విశ్వబ్రాహ్మణులకు రాజకీయాల్లో ప్రాధాన్యం కల్పించాలని ప్రకాశం జిల్లా విశ్వ బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు చెన్నుపల్లి శ్రీనివాసాచారి డిమాండ్ చేశారు. పట్టణంలోని అయ్యప్పస్వామి దేవస్థాన ఆవరణలో ఆదివారం ఏర్పాటు చేసిన విశ్వబ్రాహ్మణుల మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. విశ్వబ్రాహ్మణులకు ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో రాజకీయ ప్రాధాన్యం ఇచ్చిన పార్టీల వైపే విశ్వబ్రాహ్మణులు మొగ్గు చూపాలని, జనాభా దామాషా ప్రకారం విశ్వబ్రాహ్మణులకు ప్రధాన రాజకీయ పార్టీలు ఎమ్మెల్యే అభ్యర్థులుగా టికెట్ కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ గోనుగుంట రజిని మాట్లాడుతూ అట్టడుగున్న విశ్వబ్రాహ్మణులందరికీ ప్రభుత్వాలు అందించే సంక్షేమ పథకాలు అందే విధంగా స్థానిక సంఘాలు కృషి చేయాలని అన్నారు. ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం ద్వారా అర్హులైన సాంప్రదాయ చేతి వృత్తిదారులందరికీ లోన్లు మంజూరు చేయించి వారి ఆర్థికాభివృద్ధికి తగిన ప్రాధాన్యత కల్పిస్తామని అన్నారు. ముందుగా బస్టాండ్ వద్ద ఉన్న వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహానికి పూలమాలవేసి స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సుతారం శ్రీనివాసులు, గిద్దలూరు సంఘ అధ్యక్షులు మునులపాటి వీరభద్రాచారి, కుందుర్తి సీతారామాంజనేయులు, పొన్నపల్లి బ్రహ్మానందం, పనిదపు సుధాకర్, నల్లగట్ల ఈశ్వరాచారి, కమ్మరి రాజు ఆచారి, ఏలూరు వీరబ్రహ్మం, వడ్ల వీరయ్యాచారి పాల్గొన్నారు.

కష్టపడే వారిని పార్టీ గుర్తిస్తుంది

టిడిపి కనిగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఉగ్ర నరసింహారెడ్డి

ప్రజాశక్తి-పామూరు

టిడిపిలో కష్టపడే నాయకులను, కార్యకర్తలను గుర్తించి తగిన ప్రాధాన్యత ఇస్తుందని పార్టీ కనిగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని పువ్వాడి ఫంక్షన్ హాల్లో టిడిపి ముఖ్య కార్యకర్తల సమావేశం డివి మనోహర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ, ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేసి టిడిపి గెలుపునకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. వైసిపి మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ దరిశి రాముఉగ్ర సమక్షంలో టిడిపిలో చేరారు. ముందుగా ఆర్టీసీ డిపో నుంచి బైక్ ర్యాలీతో ఫంక్షన్ హాల్‌కు చేరుకున్నారు. అనంతరం మోపాడు గ్రామంలో పలువురు పార్టీలు చేరారు. ఈ కార్యక్రమంలో కనిగిరి నియోజకవర్గ అన్ని మండలాల నాయ కులు దొడ్డ వెంకటసుబ్బారెడ్డి టి శ్రీని వాసులు, తమ్మినేని శ్రీనివాసులు, వెంగ య్య, బేరి పుల్లారెడ్డి, సిలకం వెంక టేశ్వర్లు, ఎన్ వెంకటేశ్వర్లు, బొల్లా నర సింహారావు, యారవ శ్రీనివాసరావు, ఆవుల నాగేశ్వరావు, తడికమల్ల సుబ్బా రావు, ఇరి కోటిరెడ్డి, ఎస్కే రహమతుల్లా, బి సత్యనారాయణ పాల్గొన్నారు.

మద్దతుదార్లతో కిక్కిరిసిన గొట్టిపాటి కార్యాలయం

ప్రజాశక్తి- సంతమాగులూరు

గ్రామాల్లో ప్రతి ఇంటికి వెళ్లి టిడిపి భవిష్యత్తు గ్యారంటీ పథకాలను ప్రజలకు వివరించాలని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ కోరారు. మండలంలోని పుట్టావారిపాలెం అడ్డరోడ్డు జంక్షన్ సమీపంలోని ఆయన అతిథిగృహంలో వెల్లలచెరువు, కొమ్మాలపాడు, సజ్జాపురం, కొప్పరం, ఏల్చూరు, పుట్టావారిపాలెం, సంతమాగులూరు గ్రామాలకు చెందిన యూనిట్, బూత్, పేజీ నేస్తం సభ్యులు, గ్రామ అధ్యక్షులు, నేతలతో గ్రామాల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. ప్రజలతో నిరంతరం సంబంధాలు కలిగి ఉండాలని కోరారు. టిడిపి, జనసేన పొత్తు ప్రజలు అంగీకరించి మనస్ఫూర్తిగా ఆహ్వానిస్తున్నారని అన్నారు. ఈ పొత్తుతో వైసిపి చిత్తు అవ్వడం ఖాయమని అన్నారు. రాష్ట్రంలో 1కోటి 3లక్షలు 33 వేల మందికిపైగా ప్రజలు అభిప్రాయాన్ని పరిగణలోకి తీసుకుని జాబితాను సిద్ధం చేశారని అన్నారు. దేశ రాజకీయ చరిత్రలో ఇప్పటి వరకు బహుజనులకు ఏ పార్టీ ఇవ్వనన్ని సీట్లను టిడిపి, జనసేన ఇచ్చాయని అన్నారు. తొలి జాబితాతోనే అభ్యర్థుల్లో గెలుపుపై మరింత ఆత్మవిశ్వాసం పెరిగిందని అన్నారు. కొత్త జాబితాలో 23మంది కొత్తవారికి సీట్లు కేటాయించినట్లు తెలిపారు. 99సీట్లలో 15శాతం మహిళలకు కేటాయించారని అన్నారు. మాదిగలకు 11మంది, మాలలకు 8మందికి ప్రాతినిధ్యం కల్పించినట్లు తెలిపారు. టిడిపి బడుగు, బలహీన వర్గాలకు చెందిన పార్టీ అని మరోసారి రుజువైందని అన్నారు. జగన్‌రెడ్డి ఎస్సీలను కేవలం ఓటు బ్యాంకుగా ఉపయోగించుకుంటున్నారని అన్నారు. ఎస్‌సిలకు రావలసిన రాజ్యాంగబద్ధ హక్కులను కాలరాశాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. మొదటి జాబితాలోనే ఎస్సీలకు అగ్ర తాంబూలం వేసిన టిడిపికి దళితులంతా మద్దతు తెలిపి రాబోయే ఎన్నికల్లో అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమానికి ముందుగా సంతమాగులూరు ఎస్సీ, బీసీ కాలనీలకు చెందిన వైసీపీకి చెందిన కార్యకర్తలు మాజీ ఎంపిపి ఆట్ల చిన్నవెంకటరెడ్డి ఆధ్వర్యంలో రవికుమార్ సమక్షంలో టిడిపిలో చేరారు. వారికి టిడిపి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పుట్టావారిపాలెం సర్పంచి సన్నెబోయిన గురు యాదవ్ ఆధ్వర్యంలో వైసిపికి చెందినవాళ్లు టిడిపిలో చేరారు. దీంతో అతిథిగృహం కిటకిట లాడింది. కార్యక్రమంలో నాయకులు చేవూరు వాసురెడ్డి, ఆట్ల పెద్ద వెంకటరెడ్డి, బండారు పుల్లారావు, ధూపాటి ఏసోబు, మాదాల సుబ్బారావు, కొనికి శ్రీనివాసరావు, గొట్టిపాటి చౌదరి బాబు, తేలప్రోలు రమేష్ పాల్గొన్నారు.

గొట్టిపాటి రవికి మద్దతు ప్రకటించిన వివిధ గ్రామాల నేతలు

సంక్షోభంలో ముస్లిముల సంక్షేమం

◆ జగన్‌రెడ్డి కనుసన్నల్లోనే దాడులు ◆ సంక్షేమ పథకాలన్నీ పునరుద్ధరిస్తాం ◆ మండలి మాజీ చైర్మన్ షరీఫ్, ఎంఎల్ఎ ఏలూరి

ఎన్‌టిఆర్‌కు నివాళి అర్పిస్తున్న మండలి మాజీ చైర్మన్ షరీఫ్

ప్రజాశక్తి -పర్చూరు

సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హయాంలో ముస్లిం మైనారిటీల సంక్షేమాన్ని సంక్షోభంలోకి నెట్టివేశారని శాసన మండలి మాజీ చైర్మన్ ఎంఎ షరీఫ్, టిడిపి బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, టిడిపి అధికార ప్రతినిధి, గుంటూరు టిడిపి ఇన్చార్జ్ నసిర్ అహ్మద్, మైనారిటీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మౌలానా మస్తాన్ అహ్మద్ అన్నారు. స్థానిక అద్దంకి నాంచారమ్మ కళ్యాణ మండపం వద్ద ఘర్ ఘర్ కా చంద్రబాబు హమారా కార్యక్రమంలో భాగంగా జరిగిన సభలో మాట్లాడారు. ముస్లిం ఓట్లతో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని మండిపడ్డారు. జగన్మోహన్ రెడ్డి పాలనలో ముస్లింలపై దాడులు, దౌర్జన్యాలు పెరిగిపోయాయని అన్నారు. అధికారం కోసం ముస్లింల ఓట్ల కోసం మొసలి కన్నీరు కార్చిన జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే ముస్లిముల సంక్షేమాన్ని విస్మరించారని అన్నారు. ముస్లింల అభ్యున్నతిని విస్మరించి వారికి మొండి చేయి చూపారని ఆరోపించారు. టిడిపి ప్రభుత్వంలో అమలు చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలన్నీ జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేయకుండా రద్దుచేసి ముస్లింలను దగా చేశారని అన్నారు. రాష్ట్రంలో మైనారిటీ వర్గాలపై వంద మందికిపైగా దాడులు, హత్యలు, ఆత్మహత్యలకు వైసిపి ప్రభుత్వం వేధింపులే కారణమని అన్నారు. మైనారిటీ వర్గాలను చిత్రహింసలకు గురిచేసిన ఘనత వైసీపీ ప్రభుత్వానిదేనని అన్నారు. ముస్లిం మైనారిటీలకు అనేక హామీలు ఇచ్చి వాటిని అమలు చేయకుండా మోసం చేశారని అన్నారు. ముస్లింల సంక్షేమం అభివృద్ధికి టిడిపి కట్టుబడి ఉందన్నారు. టిడిపి ప్రభుత్వ హయాంలో ముస్లింలకు అనేక రకాల అభివృద్ధి ఫలాలు అందించామని గుర్తు చేశారు. 50శాతం సబ్సిడీతో రూ.2లక్షల వరకు రుణాలు రూ.50కోట్లతో నూర్ భాషా ఫెడరేషన్ ఏర్పాటు చేశామని అన్నారు. పేద ముస్లిం విద్యార్థులకు ఉర్దూ ఇంగ్లీష్ మీడియంలో గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేసి స్కాలర్షిప్లు అందించినట్లు తెలిపారు. పేద ముస్లిం విద్యార్థులకు విదేశీ విద్యకు రూ.10లక్షల ఆర్థిక సహాయం చేసినట్లు గుర్తు చేశారు. దుల్హన్ పథకం ద్వారా రూ.50వేలను ఎలాంటి షరతులు లేకుండా 38వేల మందికి ఆర్థిక సహకారం అందించినట్లు తెలిపారు. 300 కుపైగా సాధిఖానాలను ఏర్పాటు చేసి అత్యాధునిక హంగులతో నిర్మించామని అన్నారు. ఇళ్ల నిర్మాణం, ముస్లిం యువతకు ఉపాధి అవకాశాలు, వేలాది మసీదులకు మరమ్మత్తులు, పునర్నిర్మాణం, ఉర్దూ భాషకు అధికార భాషగా గుర్తింపునకు టిడిపి కృషి చేసిందని అన్నారు. వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నామని అన్నారు. ముస్లింల అభ్యున్నతి లక్ష్యంగా టిడిపి పని చేస్తుందని పేర్కొన్నారు. తొలుత అతిథులకు ముస్లిం సోదరులు ఘన స్వాగతం పలికారు. పుష్పగుచ్చం అందించి శాలువాలతో సత్కరించారు. టిడిపి రాష్ట్ర ఆర్గనైజ్ సెక్రటరీ అబ్దుల్ రజాక్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో టిడిపి బాపట్ల పార్లమెంటు కార్యదర్శి జమాలుద్దీన్, మండల ప్రధాన కార్యదర్శులు కాసిం, ఆజాద్, హుస్సేన్, రఫీ, అబ్దుల్ మునీఫ్, ఫరీద్, మస్తాన్ ,షేక్ హుస్సేన్, షేక్ రసూల్, హుస్సేన్, గౌస్, హుస్సేన్, బాబర్, మస్తాన్ పాల్గొన్నారు.

ఇంకొల్లు రూరల్ : మండలంలోని 200మంది ముస్లింలు పర్చూరులో జరిగిన ఆత్మీయ సమావేశానికి ముస్లిం మైనార్టీ సంఘ మండల అధ్యక్షులు షేక్ బాబర్ భాష ఆధ్వర్యంలో తరలి వెళ్లారు. కార్యక్రమంలో డాక్టర్ రఫీ, మీరావలి, మస్తాన్ బాబా, మహమ్మద్ అలీ, మస్తాన్‌వలి, రబ్బాని, సుభాని, మౌలాలి, ఖాజావలి, షేక్ జాను, షేక్ సుల్తానా, మీరాబీ, పర్వీన్, మాబుల్లా, జహ్రాబీలతో పాటు 200మంది కార్యకర్తలు, అభిమానులు, మహిళలు పాల్గొన్నారు.

ఇంకొల్లు నుండి పర్చూరుకు తరలిన ముస్లిం నాయకులు

పర్యాటకులు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - చీరాల

తీర ప్రాంతాలకు వచ్చే పర్యటకులు సముద్ర స్నానాలు చేసేటప్పుడు జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలు నివారించవచ్చని ఈపురుపాలెం ఎస్ఐ ఎంవి శివకుమార్ అన్నారు. సముద్రతీర ప్రాంతాలైన రామాపురం, వాడరేవు గ్రామాల్లో సముద్ర స్నానాలకు వచ్చిన యాత్రికులకు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. రెండు ప్రాంతాల్లో అలలు దాటి లోపలికి వెళ్ళి స్నానాలు చేయడం ప్రమాదకరమని అన్నారు. తగిన జాగ్రత్తలు పాటిస్తే సముద్ర స్నానం ఆహ్లాదకరంగా ఉంటుందని అన్నారు. చిన్న పిల్లలను, వృద్ధులను ఒంటరిగా సముద్ర స్నానాలకు వదల కూడదని సూచించారు. అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఇటీవల కాలంలో సముద్ర స్నానాలకు వచ్చిన పర్యాటకులు సముద్రపు అలల తీవ్రత తెలియ లోతైన ప్రాంతాలకు స్నానానికి వెళ్లి ప్రమాదానికి గురైన ఘటనలు ఉన్నాయని గుర్తు చేశారు. స్నానాలు చేస్తున్న వారిని నిత్యం గమనించాలని చెప్పారు. ఏదైనా ఇబ్బంది ఎదురైతే వెంటనే పోలీసు, మెరైన్, గజీత గాళ్ల సహాయం తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, మెరైన్ సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ శివకుమార్

నరేంద్రవర్మను కలిసిన హరనాథరెడ్డి

ప్రజాశక్తి - బాపట్ల

నియోజకవర్గంలో రాజకీయాల రంగులు మారుతున్నాయి. వైసిపి నాయకులు, ప్రముఖ న్యాయవాది కళ్ళం హరినాధరెడ్డి ఆదివారం టిడిపి అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మతో భేటీ అయ్యారు. వీరిద్దరి కలయిక ఆసక్తి కరంగా మారింది. ఇటీవల వైసిపి అభ్యర్థి రెడ్డి సామాజికవర్గానికి చెందిన వ్యక్తులకు ఇవ్వాలని ఆయన కోరారు. రఘుపతి అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తూ వచ్చారు. ఈ నేపథ్యంలో వైసిపి ఆవిర్భావం నుండి వైసిపిలో కొనసాగుతూ వచ్చిన హరినాధరెడ్డి టిడిపి అభ్యర్థి వేగేశన నరేంద్ర వర్మతో భేటీ కావడం నియోజకవర్గం రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. నరేంద్ర వర్మ నివాసానికి హరినాధరెడ్డి వచ్చి ఆయనను వ్యక్తిగతంగా కలిశారు. ఒకటి, రెండ్రోజుల్లో తమ అనుచరుల అభిప్రాయాలు తీసుకున్న అనంతరం పార్టీ మారే అంశంపై స్పష్టమైన ప్రకటన చేస్తానని ఈ సందర్భంగా హరినాదరెడ్డి తెలిపారు. సుమారు గంటకుపైగా వీరిద్దరి మధ్య సుదీర్ఘ రాజకీయ చర్చ జరిగింది. అందరి దృష్టి వీరిద్దరి కలయికపైనే పడింది. ఎన్నికలు దగ్గరయ్యేకొద్ది ఇంకెన్ని మార్పులు జరుగుతాయో చూడాలి. వీరితోపాటు సీనియర్ టిడిపి నాయకులు కామేపల్లి కృషి బాబు, మొవ్వ లక్ష్మీ సుభాషిణి పాల్గొన్నారు.

నరేంద్ర వర్మతో సమావేశమైన కళ్ళం హరినాదరెడ్డి

కార్యకర్తలతో మాట్లాడుతున్న హనిమిరెడ్డి

'సిద్ధం'గా ఉండాలి: హనిమిరెడ్డి

ప్రజాశక్తి - అద్దంకి

అత్యంత ప్రతిష్టాత్మకంగా జగనన్న నిర్వహిస్తున్న ఎన్నికల సమరానికి సిద్ధం సభలు భీమిలి, రాప్తాడు, ఏలూరుల్లో లక్షలాది మందితో విజయవంతంగా జరిగాయని, అంతకు మించిన భారీ జన సమీకరణతో మార్చి 3న జరిగే సిద్దం ముగింపు సభను విజయవంతం చేయాలని వైసిపి ఇన్చార్జ్ పాణెం హనిమిరెడ్డి కోరారు. స్థానిక వైసిపి కార్యాలయంలో బూత్ కమిటీ సభ్యులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ చరిత్రలో కనీ, వినీ ఎరుగని రీతిలో సిద్ధం ముగింపు సభ కొరిసపాడు మండలం మేదరమెట్ల, గుడిపాడు జాతీయ రహదారిని ఆనుకొని కొన్ని లక్షల మందితో జరగనుందని తెలిపారు. ప్రతి ఇంటికి ఓ మనిషి చొప్పున ఊరు, వాడ కదిలేలా ప్రతి కార్యకర్త ప్రత్యేక శ్రద్ధతో పని చేయాలని అన్నారు. జగనన్న నవరత్నాల ద్వారా ప్రతి ఇంటికి లబ్ధి చేకూరిందని అన్నారు. వారందరినీ కదిలించడం ద్వారా సిద్ధం ముగింపు సభతో అద్దంకిలో వైసీపీ విజయ యాత్రకు శ్రీకారం చుట్టాలని అన్నారు. నాలుగు ఉమ్మడి జిల్లాల పరిధిలో జరిగే ఈ సభకు అద్దంకి నియోజకవర్గాన్ని ఎంపిక చేయటం మన అందరి అదృష్టమని అన్నారు. జగనన్న అద్దంకి మీద కేంద్రీకరించారని చెప్పటానికి ఇంతకంటే మరొక అవకాశం లేదని అన్నారు. అద్దంకిలో వైసీపీ జెండా ఎగుర వేయాలనే జగనన్న లక్ష్యానికి ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేసి సభను విజయవంతం చేయటంలో భాగస్వామ్యం కావాలని కోరారు.

కోన రఘుపతిని కలిసిన రూత్ రాణి

వైసిపి పరిశీలకులుగా రూత్ రాణి

ప్రజాశక్తి - బాపట్ల

వైసిపి నియోజకవర్గ పరిశీలకులుగా పొన్నూరు మునిసిపల్ మాజీ చైర్ పర్సన్ రూత్ రాణిని సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నియమించారు. ఆమె ఎంఎల్ఎ కోన రఘుపతిని ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో తాజా రాజకీయ పరిస్థితులపై ఆయనతో చర్చించారు. కార్యక్రమంలో మణి భూషణ్, చేజర్ల నారాయణరెడ్డి, వడ్డీముక్కల డేవిడ్ పాల్గొన్నారు.

చీరలు పంపిణీ చేస్తున్న నరేంద్ర వర్మ

టిడిపిని గెలిపిద్దాం: నరేంద్ర వర్మ

ప్రజాశక్తి - బాపట్ల

టిడిపిని గెలిపిచాలని టిడిపి అభ్యర్థి వేగేశన నరేంద్ర వర్మ కోరారు. టిడిపి, జనసేన సంయుక్తంగా ఇంటింటికి టిడిపి, మీ మాట – నా బాట, జనసేన, టిడిపి జనబాట కార్యక్రమాన్ని మండలంలోని హనుమాన్ నగర్, పోతురాజు కొత్తపాలెం గ్రామాల్లో జనసేన నాయకులతో కలిసి ఆయన పర్యటించారు. టిడిపి, జనసేన ఉమ్మడి మినీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. టిడిపి అమలు చేయబోయే పథకాలను వివరిస్తూ మహిళలకు పుస్తకం, చీర, చేతి సంచి పంపిణీ చేశారు. కార్యక్రమంలో కావూరి శ్రీనివాసరెడ్డి, తాతా జయప్రకాష్ నారాయణ, పల్లం సరోజినీ, పల్లం జీవన్, దయా బాబు, ఫరీద్, మస్తాన్ పాల్గొన్నారు.

వాగుమడుగులో తాగునీటికి కటకట

అవస్థలు పడుతున్న గ్రామస్తులు ● అలంకారప్రాయంగా దర్శనమిస్తున్న ఓవర్ హెడ్, మినీ ట్యాంకు

ప్రజాశక్తి- కొనకనమిట్ల

మండలంలోని వాగుమడుగులో తాగునీటి కోసం గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఓవర్ హెడ్ ట్యాంకుకు సాగర్ నీరు సరఫరా కాక మూడు నెలలు పైగా అయింది. డీప్ బోర్లలో నీరు అడుగంటి పోవడంతో రెండు లేక మూడు బిందెలకు మించి నీరు రావడం లేదని మహిళలు అంటున్నారు. నెలల తరబడి తాగునీరు, వాడుకునే నీరు లేక నానా ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. వారానికి ఒకసారి కూడా బట్టలు ఉతుక్కునే పరిస్థితి లేదు. అంతేకాకుండా మరుగుదొడ్లకు, బాత్రూంకు వెళ్లాలంటే నీరు లేక చెంబు తీసుకుని దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన దుస్థితి ప్రస్తుతం ఏర్పడిందని మహిళలు వాపోతున్నారు. ప్రజల దాహార్తిని తీర్చేందుకు లక్షలాది రూపాయలు వెచ్చించి ఓవర్ ట్యాంక్, మినీ ట్యాంకులను ఏర్పాటు చేశారు. నేడు అవి నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. పనుల కాలం కావడంతో ఉదయాన్నే లేచి నీటి కోసం పరుగులు తీయాలో.. కూలి కోసం వెళ్లాలో అర్థం కాని పరిస్థితి నెలకొందని పలువురు మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూలికి వెళ్లకపోతే పూట గడవని పరిస్థితి. గత కొన్ని నెలలుగా సాగర్ నీరు సరఫరా కాని విషయం, డీప్ బోర్లలో నీటి ధార తగ్గిన విషయం, నీటి కోసం తాము పడుతున్న ఇబ్బందులను అధికారులకు, సర్పంచులకు విన్నవించుకున్నా పట్టించుకోవటం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది పొలాల్లోని వ్యవసాయ బోర్ల వద్దకు ట్రాక్టర్‌తో

డీప్ బోర్ వద్ద నీటి కోసం పడిగాపులు కాస్తున్న మహిళలు

వెళ్లి నీటిని తెచ్చుకొని వాడుకుంటున్నారని, అంత దూరం నడిచివెళ్లి తెచ్చుకోలేని వారి పరిస్థితి అగమ్య గోచరంగా ఉందని చెబుతున్నారు. ఇంటింటికీ కొళాయిలు ఏర్పాటు చేసి నీటిని అందిస్తామని, గుంతలు తీసి పైపులు వేసిన కాంట్రాక్టర్ కనెక్షన్ ఇవ్వకుండా కడుమరుగయ్యారని, ఆ పైపులు తట్టుకొని పడిన సంఘటనలు లేకపోలేదని మహిళలు వాపోతున్నారు. నీటిని తాగాలన్నా, వాడుకోవాలన్నా డబ్బులు పెట్టి కొనుగోలు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని అంటున్నారు. పలుమార్లు పంచాయతీ కార్యదర్శికి సమస్యను విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. గ్రామంలో ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేయాలని వారు కోరుతున్నారు. ఇప్పుడే నీటి సమస్య ఇంత తీవ్రంగా ఉంటే భవిష్యత్తు వేసవిలో తమ పరిస్థితి ఏంటని ప్రశ్నిస్తున్నారు. నీటి సమస్యను పరిష్కరించకపోతే సచివాలయం ముట్టడిస్తామని కాలే తిరుపతమ్మ, వెంకటలక్ష్మమ్మ, బొరిగర్ల అంజలి, ఆదిలక్ష్మమ్మ, కదమ వెంకట స్వామి, జాజం జ్యోతి, బి గిరిజ, మహాలక్ష్మి మహిళలు ఆవేదనతో హెచ్చరిస్తున్నారు.

గుక్కెడు నీరే కదా.. అడిగింది: కోటిలింగమ్మ

మేము పంచభక్ష పరమాన్నం అడగలేదు. తాగటానికి గుక్కెడు నీరు అడిగాము అంతే అది కూడా తీర్చలేని అధికారులు, పాలకుల తీరు చూస్తుంటే బాధేస్తుందని కోటి లింగమ్మ ఆవేదన వ్యక్తపరిచారు. సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యామ్నాయ మార్గాలు చూడాలన్నారు. తాగునీటి సమస్యను తీర్చలేనివారు ఏం అభివృద్ధి చేస్తారని ప్రశ్నించారు. ఓట్లకు వస్తే బుద్ధి చెబుతామని కోటి లింగమ్మ హెచ్చరించారు.

నీటి సమస్య పరిష్కారానికి కృషి: సర్పంచ్ బూదాల జోసఫ్

వాగుమడుగు గ్రామంలో నీటి సమస్య ఉన్న విషయాన్ని గమనించాను. ఎంపీడీవో ఆర్ జనార్దన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నారాయణస్వామితో మాట్లాడి ట్యాంకర్లను ఏర్పాటు చేయించి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాను. అంబాపురం, రేగడిపల్లి గ్రామాలలో ఇప్పటికే ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్నామని సర్పంచ్ బూదాల జోసఫ్ కమలాకర్‌రావు తెలిపారు.

కేంద్ర బృందంతో హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది

పిహెచ్‌సిలో కేంద్ర బృందం పరిశీలన

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

నగర పరిధిలోని అరుణోదయ కాలనీని వైఎస్ఆర్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్ స్టాండర్డ్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా హాస్పిటల్‌లోని వసతులను, రోగులకు అందుతున్న సేవలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అధికార బృందం సభ్యులు డాక్టర్ నితిన్‌దత్ భరద్వాజ్, డాక్టర్ కల్పనా శంకరన్, పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ వరుణ్‌తేజ్, క్వాలిటీ మేనేజర్ కృష్ణప్రసాద్, సిబ్బంది, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

ఎంసి చైర్మన్‌తో వైసిపి ఇన్‌ఛార్జి దద్దాల

ఏఎంసీ చైర్మన్‌ను కలిసిన ఇన్‌ఛార్జి దద్దాల

ప్రజాశక్తి-కనిగిరి

కనిగిరి ఏఎంసి చైర్మన్ చింతగుంట్ల సాల్మన్‌రాజును కనిగిరి వైసీపీ ఇన్‌ఛార్జి దద్దాల నారాయణ యాదవ్ ఏఎంసి చాంబర్లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కనిగిరి నియోజకవర్గంలోని రాజకీయ పరిస్థితులపై చర్చించుకున్నారు. జగనన్న దళిత సామాజిక వర్గాలకు పెద్దపీట వేస్తూ బడుగు బలహీన వర్గాలకు అవకాశాలు కల్పించిన ఘనత జగనన్నకే దక్కుతుందని కాబట్టి ప్రతి ఒక్కరం కలిసికట్టుగా పనిచేసి నియోజకవర్గంలో వైసీపీ జెండా ఎగరేసి జగనన్నకు కానుకగా ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, మున్సిపల్ వైస్ చైర్మన్ మాణిక్యరావు, కనిగిరి జడ్‌పిటిసి కస్తూరిరెడ్డి, మాజీ సింగల్ విండో చైర్మన్ ఎస్ మోహన్‌రెడ్డి, సానుకొమ్ము వెంకటేశ్వరరెడ్డి, దాదిరెడ్డి మాలకొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రం వద్ద అధికారులు

భారీ భద్రత నడుమ గ్రూప్-2 పరీక్షలు

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ మండలంలో గ్రూప్-2 పరీక్షలు ఆదివారం నాడు భారీ భద్రత నడుమ నిర్వహించారు. పిఎన్‌సిపి డిగ్రీ కళాశాలలో మలినేని సుశీలమ్మ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ఈ పరీక్షలు నిర్వహించారు. సిఐ దాచేపల్లి రంగనాథ్, ఎస్ఐ టి శ్రీరామ్, తహశీల్దారు ఎం భవానిశంకర్, డిప్యూటీ తహశీల్దారు తన్నీరు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో రెండు సెంటర్ల వద్ద భారీ పోలీసు బందోబస్తు నిర్వహించి గ్రూప్-2 పరీక్షా నియమ నిబధనల ప్రకారమే ప్రతి ఒక్కరినీ పరీక్ష హాల్లోకి అనుమతించారు. మలినేని ఇంజనీరింగ్ కళాశాలలో 500 మంది హాజరు కావాల్సిందిగా 426 మంది మాత్రమే పరీక్ష రాశారు. 74 మంది పరీక్షకు గైర్హాజరయ్యారు. పిఎన్‌సిపి డిగ్రీ కళాశాలలో 400 మందికి 323 మంది హాజరయ్యారు. 77 మంది హాజరు కాలేదు. పరీక్షా కేంద్రాల చుట్టుపక్కల ప్రాంతంలో ఎవరినీ అనుమతించకుండా భారీ బందోబస్తు నిర్వహించారు.

ఎన్నికల్లో టిడిపి-జనసేనదే విజయం

ప్రజాశక్తి-చీమకుర్తి

కార్యక్రమంలో పాల్గొన్న బిఎన్ విజయకుమార్

రాబోయే ఎన్నికల్లో టిడిపి-జనసేనదే విజయమని సంతనూతలపాడు మాజీ ఎమ్మెల్యే బిఎన్ విజయకుమార్ పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక రచ్చమిట్ట, గరికమిట్ట సెంటర్లలలో జరిగిన బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ముందుగా రచ్చమిట్ట సెంటర్‌లో టిడిపి జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఇంటింటికీ తిరిగి టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేసే సంక్షేమ పథకాల గురించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బిఎన్ విజయకుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచకపాలన సాగుతోందని అన్నారు. జగన్ అరాచక పాలనకు చరమగీతం పాడాలన్నారు. టిడిపి, జనసేన కలయికతో వైసిపితో కలవరం బయలుదేరిందన్నారు. దోపిడీ లేని పాలన కోసం టిడిపి ఆదరించాలన్నారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా నాయకులు మన్నం ప్రసాదు, గొల్లపూడి సుబ్బారావు, అయినీడి సుబ్బారావు, కాట్రగడ్డ రమణయ్య, ఉన్నం సుబ్బారావు, యడ్లపల్లి రామబ్రహ్మం, శేషయ్య, సూరంపల్లి హనుమంతరావు, నర్రా నాగరాజు, గొల్లపూడి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా: అన్నా

మాట్లాడుతున్న అన్నా రాంబాబు

ప్రజాశక్తి-పొదిలి: ఒక్కసారి గెలిపిస్తే మార్కాపురం నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని గిద్దలూరు శాసనసభ్యులు అన్నా వెంకట రాంబాబు అన్నారు. ఆదివారం రాత్రి పొదిలి పట్టణంలో ఆర్యవైశ్య సంఘం ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తోందని, ఆయన ఆశయాల సాధనలో తాను మార్కాపురం వచ్చానట్లు తెలిపారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు గునుపూడి చెంచు సుబ్బారావు(జిసి) ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ మాట్లాడుతూ గత 20 సంవత్సరాలపైగా ఈ ప్రాంత ప్రజలకు చిరపరిచితులైన అన్నా రాంబాబును మంచి ఆత్మీయత, అభిమానంతో గెలిపించాలన్నారు. మార్కాపురం ఏఎంసి చైర్మన్ షంషీర్ అలీ బేగ్, సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, వేమా కృష్ణమూర్తి కంకణాల రమేష్, యక్కలి శేషగిరిరావు, ముప్వల పార్థు, కనుమర్లపూడి లక్ష్మి, మర్రిపూడి ఎంపీపీ వాకా వెంకటరెడ్డి, కొనకనమిట్ల వైస్ ఎంపీపీ మెట్టు వెంకటరెడ్డి, పొదిలి వైసిపి నాయకులు గొలమారి చెన్నారెడ్డి, దుగ్గెంపూడి శ్రీనివాసరెడ్డి, ఎస్‌కె నూర్జహాన్ బేగం, గుజ్జుల సంజీవరెడ్డి, గుజ్జుల రమణారెడ్డి, గూడూరు వినోద్, వైసిపి నాయకులు, ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎన్నికలకు సంసిద్ధం కావాలి: అశోక్‌రెడ్డి

ప్రజాశక్తి-గిద్దలూరు

కార్యకర్తలతో మాట్లాడుతున్న ముత్తుముల అశోక్‌రెడ్డి

తెలుగుదేశం కార్యకర్తలు నాయకులు సార్వత్రిక ఎన్నికలకు సంసిద్ధం కావాలని గిద్దలూరు టీడీపి ఇన్‌ఛార్జి ముత్తుముల అశోక్ రెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నియోజక వర్గ స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ ఆదేశించిన ప్రతి కార్యక్రమా న్ని గ్రామాల్లో విజయవంతంగా పూర్తి చేయాల ని అన్నారు. మరో 50 రోజుల్లో ఎన్నికలు పూర్తి అవుతాయని, గిద్దలూరు నియోజకవర్గంలో తెలుగుదేశం జెండా ఎగరబోతోందని, ఎవరు ఎన్ని జిమ్మిక్కులు చేసినా, అవాకులు చవాకులు పేలినా టీడీపీ అభ్యర్థిగా తాను పోటీ చేస్తున్నట్లు తెలిపారు. మంగళవారం గిద్దలూరు పట్టణం లోని షాదీఖానాలో నియోజకవర్గ ముస్లిం మైనారిటీల ఆత్మీయ సమావేశం జరగనుందని, ఈ సమావేశానికి మైనార్టీ సోదరులు భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. వచ్చే నెల 2, 3 తేదీల్లో టీడీపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ గిద్దలూరు రానున్నారని నియోజకవర్గంలోని తెలుగుదేశం, జనసేన కుటుంబ సభ్యులతో సమావేశం అవుతారన్నారు. వైసీపీ పాలనలో జరిగిన అరాచకాలను, దోపిడీని వివరించాలని, రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమం టీడీపి జనసేనల ఉమ్మడి ప్రభుత్వంతోనే సాధ్యమని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ సెల్ అధ్యక్షులు మౌలానా ముస్తక్ అహ్మద్, గిద్దలూరు జడ్పీటీసీ సభ్యులు బుడతా మధుసూదన్ యాదవ్, కాపు నాయకులు దుత్తా బాలఈశ్వరయ్య తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

నైతిక విలువలు పెంపొందించాలి

ప్రజాశక్తి-చీమకుర్తి

మాట్లాడుతున్న జెవివి జిల్లా గౌరవాధ్యక్షులు డాక్టర్ బి జవహర్

విద్యార్థులలో నైతిక విలువలతో పాటు క్రమశిక్షణ పెంపొందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని జెవివి జిల్లా గౌరవాధ్యక్షులు డాక్టర్ బి జవహర్ పేర్కొన్నారు. స్థానిక రామ్‌నగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ రామనగర్ పాఠశాల అభివృద్ధికి చీమకుర్తి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో కృషి చేసినట్లు తెలిపారు. మద్దిపాడు ఏఎంసి మాజీ చైర్మన్, వైసిపి అద్దంకి నియోజకవర్గ పరిశీలకులు మారం వెంకారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టపడి చదువుకొని, ఉన్నత ఉద్యోగాలు పొందాలని అన్నారు. ఎంఈఓ కె శివాజీ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు పటిష్టంగా పనిచేస్తున్నాయని అన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలంకరించాయి. కార్యక్రమంలో జెసిఎస్ పట్టణ కన్వీనర్ మంచా హరికృష్ణ, కౌన్సిలర్లు సోమాశేషాద్రి, పొదిలి కాశయ్య, ఎస్ సుందరరామిరెడ్డి, మేకల యల్లయ్య, మంచా నితీష్, జి చినవెంకటేశ్వర్లు, ప్రధానోపాధ్యాయులు ఏ వీరారెడ్డి, ఎస్‌కె నసీమాబాను, శ్రీనివాసరావు, శ్రీదేవి, యూటిఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు ఎస్‌కె అక్బర్, చలువాది శ్రీనివాసరావు, ఏపిటిఎఫ్ నాయకులు జె యాకోబు, ఎస్‌టియు నాయకులు ఎస్‌కె ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

ఏలూరి సమక్షంలో టిడిపిలో చేరిన నాయకులు

ఏలూరి సమక్షంలో టిడిపిలో చేరిక

ప్రజాశక్తి - పర్చూరు

మండలంలోని చెరుకూరు గ్రామానికి చెందిన వైసిపి నాయకులు టిడిపి బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సమక్షంలో టిడిపిలో ఆదివారం చేరారు. వారికి ఆయన టిడిపి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టిడిపిలో చేరిన వారిలో దాసి రక్షణ, దాసి జాన్ బాబు, కట్టా నాని, జొన్నలగడ్డ అంకయ్య, రవీంద్రబాబు ఉన్నారు.

గొట్టిపాటి రవికి తిమ్మాయపాలెం వాసుల సంఘీభావం

గొట్టిపాటికి సంఘీభావం

ప్రజాశక్తి - అద్దంకి

మండలంలోని తిమ్మాయపాలెం గ్రామానికి చెందిన వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలు ఎంఎల్ఎ గొట్టిపాటి రవి కుమార్ సమక్షంలో టిడిపిలో చేరారు. గ్రామానికి చెందిన భీమిశెట్టి మహేష్, శ్రీనివాసరావు, సుబ్బారావు, ఏడుకొండలు, పరిటాల రాఘవ, పసుపులేటి వెంకటేశ్వర్లు, మురళి, రామాంజనేయులు తదితరులు రవికుమార్‌ను కలసి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల కష్టాలకు కారకుడైన జగన్‌ను ఇంటికి పంపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. ప్రజలపై పన్నుల భారం మోపడమే కాకుండా 45రకాల పన్నులు వేసిన చెత్త సైకో సిఎం వైఎస్ జగన్ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ, జనసేన అధికారంలోకి రావడం ఖాయమని గొట్టిపాటి పేర్కొన్నారు.

ఇంటింటి ప్రచారం చేస్తున్న టిడిపి నాయకులు

చంద్రబాబుతోనే రాష్ట్ర భవిష్యత్తు

ప్రజాశక్తి - రేపల్లె

రాష్ట్ర భవిష్యత్తు బాబు షురిటితోనే సాధ్యమని టిడిపి నాయకులు అనగాని శివప్రసాద్ ధీమా వ్యక్తం చేశారు. మండలంలోని మోర్లవారిపాలెం, మోర్తోట గ్రామంలో భవిష్యత్తుకు గ్యారెంటీ, బాబు షురిటి కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. తెలుగు తమ్ముళ్లు, మహిళలు పల్లెకు హారతితో ఘన స్వాగతం పలికారు. జనసేన నాయకులతో కలిసి ఇంటింటికీ కలియ తిరుగుతూ టిడిపి, జనసేన ఉమ్మడి పథకాలను ప్రజలకు వివరించారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్ర భవిష్యత్తు కోసం టిడిపి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి ఆడబిడ్డకు నెలకు రూ.1500లు, చదువుకునే పిల్లలకు ఒక్కొక్కరికి ఏడాదికి రూ.15వేలు, ప్రతి రైతుకు ఏడాదికి రూ.20వేలు, నిరుద్యోగులకు యువగళం నిధి నుంచి నెలకు రూ.3వేలు నిరుద్యోగ భృతి, ఇంటింటికి తాగునీటి కులాయి కనెక్షన్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచితంగా ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఇవ్వనున్నట్లు వివరించారు. ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేసి వచ్చే ఎన్నికల్లో టిడిపిని అధికారంలోకి తీసుకురావాలని కోరారు. వైసిపి అరాచకాలు, అక్రమాలను ప్రజలకు వివరించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావు, తాతా ఏడుకొండలు, టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదలకు 'అనిల్' ఆపన్నహస్తం

◆ నాడు లెక్చరర్‌గా.. నేడు సమాజ సేవకునిగా ◆ సొంత నగదుతో పేదలకు ఆర్థిక సాయం ◆ పద్మ భాస్కర్ ఫౌండేషన్‌తో సేవా కార్యక్రమాలు

పాఠశాల చిన్నారులకు సాయం చేస్తున్న అనీల్

ఘంటా అనీల్ సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - చీరాల

ఆంగ్ల అధ్యాపకునిగా పనిచేశారు. తన తల్లి స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు ప్రారంభించారు. ఎందరో విద్యార్థులకు ఉన్నతులుగా తీర్చిదిద్దారు. చిన్ననాటి నుండి తోటి వారికి సహాయ పడాలనే సేవా దృక్పథంతో ఉన్నారు. ఆయన ఆలోచనలకు అమ్మ ఆశయం తోడయ్యాయి. తన సొంత నిధులతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న పేదలను గుర్తించి సాయం అందిస్తూ పేదల సేవలో తాను పనిచేస్తున్నారు. ఉపాధ్యాయ వృత్తిని వదిలేసి పూర్తిగా సేవకు అంకితమయ్యారు. గత 9ఏళ్ళుగా సేవా కార్యక్రమాలు చేస్తూ పద్మ భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ ఘంటా అనీల్ కుమార్ అందరి మన్ననలు పొందుతున్నారు. స్థానిక విఠల్ నగర్‌కు చెందిన గంట భాస్కరరావు, పద్మావతి దంపతుల కుమారుడు ఘంటా అనిల్ కుమార్ స్థానిక విఆర్ఎస్ అండ్ వైఆర్ఎన్ కళాశాల్లో 13ఏళ్ల పాటు ఆంగ్ల అధ్యాపకునిగా పనిచేశారు. వేసవి సెలవుల్లో పేద విద్యార్థులకు ఉచితంగా స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులు నిర్వహించేవారు. అయితే ఆయన తాతయ్యలు దివంగత ఘంటా సుబ్బారాయుడు, నాగమ్మ, చాగంటి జింకయ్య, రత్తమ్మ జ్ఞాపకార్థం ఆయనకు వచ్చే జీతంతో తల్లి పద్మావతి ప్రోత్సాహంతో సేవ కార్యక్రమాలు నిర్వహించారు. సేవా కార్యక్రమాలపై ఆకర్షితులైన ఆయన అధ్యాపక వృత్తి రాజీనామా చేశారు. అప్పటి నుండి సామాజిక కార్యకర్తగా యానాది, దళిత కాలనీల్లో ప్రాంతాలతో సంబంధం లేకుండా తానే స్వయంగా ఆర్థిక ఇబ్బందులు పడుతున్న పేదలను గుర్తించి చేయూత అందిస్తున్నారు. 2023 ఫిబ్రవరి 24న తన తల్లిదండ్రుల పేరుతో పద్మ భాస్కర్ ఫౌండేషన్ ప్రారంభించారు. చీరాల, పర్చూరు ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు పుస్తకాలు, స్టడీ మెటీరియల్స్, స్పోకెన్ ఇంగ్లీష్, గ్రామర్ పుస్తకాలను అందించారు. అనాధ పిల్లలు, వృద్ధులు, వితంతులు, వికలాంగులు, బుద్ధిమాద్యం రోగులకు, అగ్ని ప్రమాద బాధితుల వివరాలు సేకరించి చేయూత అందిస్తున్నారు. పండగ సమయాల్లో పేద కుటుంబాలకు ఆర్థిక సహాయం చేస్తున్నారు. చీరాల, పర్చూరు మండలాల్లో 10వ తరగతి చదువుతున్న పేద విద్యార్థులకు ఘంటా విజ్ఞానం నగదు బహుమతుల పురస్కారం అందజేస్తున్నారు. ఆయన చేస్తున్న సేవలను పలువురు ప్రశంశిస్తున్నారు.

నిరంతరాయంగా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తా

ఘంటా అనీల్ కుమార్ ఫౌండేషన్ చైర్మన్

ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్న అనే సూక్తి తనను ఎంతో ప్రభావితం చేసిందని రిటైర్డు అధ్యాపకులు ఘంటా అనిల్ కుమార్ అన్నారు. చిన్ననాటి నుండి నలుగురికి సాయ పడాలనే తన ఆలోచనకు తన తల్లి పద్మావతి ఎంతో ప్రోత్సాహాన్ని ఇచ్చిందని అన్నారు. పండుగలకు వృద్ధులు, వితంతులకు నిత్య వసర సరుకులు, బట్టలు పంపిణీ చేయటం ఎంతో ఆనందాన్నిస్తుందని అన్నారు. కరోనా విపత్కర పరిస్థితుల్లో కూడా తాను యానాది కాలనీల్లో నిత్యవసర సరుకులు పంపిణీ చేసినట్లు తెలిపారు. తన ఫౌండేషన్ ద్వారా అనేక మందికి చేయూత నందిస్తూన్నట్లు తెలిపారు. ఈ తరం యువత సమాజ సేవలో తమ వంతు సాయం అందించాలని కోరారు. తనకు శక్తి ఉన్నంత కాలం సేవా కార్యక్రమాలు కొనసాగిస్తానని తెలిపారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన

◆ 942మందికి వైద్య పరీక్షలు ◆ నెలకు సరిపడా మందులు ఉచితంగా పంపిణీ

వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు నమోదు చేస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి - చీరాల

మండలంలోని వాడరేవు శ్రీశ్రీశ్రీ రామానంద ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆశ్రమం ఆవరణలో ఆదివారం ఉచిత షుగరు వైద్య శిభిరం నిర్వహించారు. శిభిరానికి విశేష స్పందన లభించింది. 942 మంది హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. 942మందికి నెల రోజులకు సరిపడు మందులు ఉచితంగా అందజేశారు. శిభభిరానికి హాజరైన వారందారికి అల్పారం, తాగున్నీరు, ఇతర సహాయక ఏర్పాట్లు చేసినట్లు ఆశ్రమ మేనేజర్ నారాయణం సురేష్ తెలిపారు. మందులు వాడటంతోపాటు ఆహార అలవాట్లు, జీవన విధానం మార్చుకోవాలని వైద్యులు సూచించారు. మానసిక ఆందోళన తగ్గించుకోవాలని చెప్పారు. జీవన విధానం మార్చుకోవడం ద్వారా షుగరు నియంత్రణలో ఉంచుకోవచ్చని చెప్పారు. క్యాంపులో డాక్టర్ ఎం రాజరాజేశ్వరి, డాక్టర్ కమలా రాజేశ్వరి, డాక్టర్ లలిత్ ప్రకాష్, డాక్టర్ పేట శ్రీకాంత్, డాక్టర్ సుధాకర్ యాదవ్, డాక్టర్ సూర్యప్రకాష్ వైద్య పరీక్షలు చేశారు. ట్రస్ట్ ఉపాధ్యక్షులు కె కృష్ణారావు, కామేశ్వరరావు, ఎంజి శంకరరావు, కుమార్, ఎ సురేష్, మిత్ర ల్యాబ్ వలి, దుర్గగుడి శీను, గోపాల్, సాయి ఫణికిషోర్, వాడరేవు స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, చీరాల మహిళా కళాశాల విద్యార్థులు రోగులకు ఆహారం, తాగునీటి వసతులు, సహాయక ఏర్పాట్లు చేశారు.

సూపర్‌సిక్స్ పథకాలు పేదలకు వరం

గుల్లపల్లిలో టిడిపి పథకాలు ప్రచారం చేస్తున్న నేతలు

ప్రజాశక్తి - చెరుకుపల్లి

టిడిపి, జనసేన ఉమ్మడి మేనిఫెస్టో సూపర్ సిక్స్ పథకాలు పేదలకు వరమని టిడిపి నాయకులు పుషాడపు కుమారస్వామి అన్నారు. బాబు షురిటీ, భవిష్యత్తు గ్యారెంటీ మండలంలోని గుల్లపల్లిలో ఆదివారం నిర్వహించారు. టిడిపి ప్రవేశ పెట్టనున్న సంక్షేమ పథకాలను వివరించారు. సంక్షేమ పథకాలతోపాటు పేదవారిని ధనికులుగా మార్చే విధంగా టిడిపి, జనసేన సంయుక్తంగా మేనిఫెస్టోను రూపొందించాయని అన్నారు. తమను ఆదరించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు తాత ఏడుకొండలు, గూడపాటి శ్రీనివాసరావు, తుళ్లూరి శివ వెంకట రామారావు, మల్లాది రామకృష్ణ, వంగర చక్రవర్తి, ఉప్పాల సాంబశివరావు, మారిశెట్టి వెంకట వరప్రసాద్, గోగినేని వసుధ, మీర్జా అజీముద్దీన్, గుర్రం వెంకటేశ్వరరావు, కందుల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. బలుసులపాలెంలో జరిగిన కార్యక్రమంలో లుక్కా గుడార వెంకయ్య, టిడిపి గ్రామ అధ్యక్షుడు పేరం శంకర్ బాబు, ఎర్రంశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'యడం బాలాజీకి సహకరించాలి'

మాట్లాడుతున్న లక్ష్మిదీపక్

ప్రజాశక్తి - యద్దనపూడి

వైసిపి ఇన్‌ఛార్జిగా నూతనంగా బాధ్యతలు తీసుకున్న యడం బాలాజీ కార్యచరణ ప్రారంభించారు. ఆయన తమ్ముడు లక్ష్మి దీపక్ మండలంలోని అనంతవరం, యనమదల గ్రామాల్లో పర్యటించారు. ఆయా గ్రామాల్లో పలువురు వైసిపి నాయకులను మర్యాద పూర్వకంగా కలిశారు. తన అన్న బాలాజీకి సహకరించాలని కోరారు.

ఎన్‌సిసి విద్యార్థులకు సర్టిఫికేట్ పరీక్షలు

ఎన్‌సిసి ఎ గ్రేడ్ సర్టిఫికెట్ల పంపిణీ

ప్రజాశక్తి - రేపల్లె

ఎన్‌సీసీలో శిక్షణ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు దోహదపడుతోందని లెఫ్టినెంట్ కల్నల్ జె మహేష్ అన్నారు. స్థానిక మౌంట్ ఫోర్ట్ పాఠశాల నందు ఎన్‌సిసి విద్యార్థులకు ఎ సర్టిఫికెట్ కొరకు వ్రాత పరీక్ష, డ్రిల్ల్ టెస్ట్ నిర్వహించారు. గత రెండేళ్ల నుండి ఎన్‌సిసి నందు శిక్షణ తీసుకున్న విద్యార్థులకు ఎన్‌సిసి తెనాలి 22వ ఆంధ్ర బెటాలియన్ అధ్వరంలో ఎన్‌సిసి ఆఫీసర్స్ సమక్షంలో వ్రాత పరీక్ష నిర్వహించి, అనంతరం డ్రిల్ల్ టెస్టులో భాగంగా విద్యార్థులు వివిధ నైపుణ్య విభాగంల నందు టెస్ట్ నిర్వహించారు. 193 మందికి ఏ సర్టిఫికెట్ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ సేవ చేయాలనే ఆలోచన ఉండి ఎన్‌సిసిలో ఏ, బి, సి సర్టిఫికెట్లు సాధిస్తే అవి ఉన్నత విద్య, ఉద్యోగాలను సాధించేందుకు ఎంతో ఉపయోగపడుతాయని అన్నారు. కార్యక్రమంలో ఎన్‌సిసి లెఫ్టినెంట్ కల్నల్ మహేష్ నాయక్, సుబేదార్ జ్యోతి సింగ్, హవల్ దార్ చరణ్ సింగ్, సిహెచ్ఎం జితేంద్ర కుమార్, నాయక్ విక్రమ్ కుమార్, ఎన్‌సిసి ఉపాధ్యాయులు మౌంట్ ఫోర్ట్ పాఠశాల నుండి బాబావలి ఖాన్, వెల్లటూరు జెడ్‌పి ఉన్నత పాఠశాల నుండి కె కుటుంబరావు, ఐలవరం జెడ్‌పి స్కూల్ నుండి కె దాదిమ్మ, రేపల్లె జాన్స్ హై స్కూల్ నుండి కె నయోమి పాల్గొన్నారు.

ప్రశాంతంగా గ్రూప్ - 2 పరీక్షలు

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

గ్రూప్ 2 పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా ముగిసాయి. స్థానిక హర్షిణి డిగ్రీ కళాశాల్లో నిర్వహించిన గ్రూప్ 2 పరీక్షలకు ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి 600మంది హాజరు కావల్సి ఉండగా 405మంది అభ్యర్థులు మాత్రమే హజరయ్యారు. 195మంది గైర్హాజరైనట్లు పరీక్షల నిర్వహణ ప్రత్యేక అధికారి, తహశీల్దారు కోటంరాజు సంధ్యశ్రీ ప్రజాశక్తికి తెలిపారు. అర్బన్ సిఐ రాజశేఖరరెడ్డి ఆధ్వర్యంలో బాపట్ల వీఆర్ ఎస్ఐ వెంకటేశ్వర చౌదరి, స్థానిక పోలీసులతో పరీక్షల నిర్వహణను పర్యవేక్షించారు. పోస్టుల సంఖ్య తక్కువ కావడంతో ధరకాస్తు చేసుకున్న వారిలో ఆసక్తి తగిందినట్లు కనిపించింది.

ఎన్‌సిసి విద్యార్థులకు పరీక్ష కిట్లు పంపిణీ

ఎన్‌సిసి విద్యార్థులతో ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలోని వెల్లటూరు జెడ్‌పి ఉన్నత పాఠశాల్లో 35మంది ఎన్‌సిసి విద్యార్థులకు ఎన్‌సిసి అధికారి కొండ పల్లి కుటుంబరావు పరీక్షా కిట్లను ఆదివారం అందజేశారు. పాఠశాలలో 6 నుండి 10వ తరగతి వరకు చదివే విద్యార్థులు ఎన్‌సిసిలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. పేటిఎంలోని మౌంట్ ఫోర్ట్ ఉన్నత పాఠశాల్లో పరీక్షలు రాయనున్న దృష్ట్యా అవసరమైన వస్తువులను అందజేసినట్లు తెలిపారు. ఈ సామాగ్రి సమకూర్చటానికి విశ్రాంత ఉపాధ్యాయులు పలగాని గోవిందు రాజులు, జీవశాస్త్ర ఉపాధ్యాయులు కె శివరామకృష్ణ ఆర్థిక సహాయం చేసినట్లు తెలిపారు. 2023 –24 ఏడాదికి ఎన్‌సిసి విద్యార్థులు పరీక్షల్లో ఉత్తీర్ణులై సర్టిఫికెట్లు పొందాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, హెచ్‌ఎం కె అరుణకుమారి పాల్గొన్నారు.

ఇంకొల్లు రూరల్ : 23వ ఆంధ్ర బేటాలియన్ చీరాల కమాండర్ ఆఫీసర్ కల్నల్ సునీల్ గౌతమ్ ఆదేశాల ప్రకారం జెడ్‌పి హైస్కూల్ ఆవరణలో ఎన్‌సిసి ఆఫీసర్ అలవలపాటి శ్రీమన్నారాయణ ఆధ్వర్యంలో పర్చూరు డివిజన్లోని జెడ్‌పి ఉన్నత పాఠశాలల నుండి 231 క్యాండేట్లకు ఎన్‌సిసి ఎ సీర్టిఫికెట్ పరీక్ష ఆదివారం నిర్వహించారు. రాత పరీక్ష, డ్రిల్ టెస్ట్, మ్యాప్ రీడింగ్, 22రైఫిల్, కంపాస్, వెపన్ ట్రైనింగ్ అంశాలపై పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు ఎన్‌సిసి అధికారులు జి శ్రీవాసరావు, సాంబశివరావు, ఆర్మీస్టాఫ్ సుబేదార్ సత్యేంధరసింగ్, దీపక్, ముర్మమ్ వ్యవహరించారు. రెండేళ్ల శిక్షణ పొంది పరీక్ష వ్రాసిన ఎన్‌సిసి క్యాడెట్లు క్రమశిక్షణతో ఉన్నతమైన భావిభారత పౌరులుగా ఎదిగి దేశానికీ సేవ చేయాలని కల్నల్ సునీల్ గౌతమ్ కోరారు. ఎ సర్టిఫికెట్ వల్ల కలిగే ఉపయోగాలు వివరించారు. కార్యక్రమంలో ఎన్‌సిసి ఆఫీసర్లు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంకొల్లులో పరీక్ష రాస్తున్న ఎన్‌సిసి విద్యార్థులు

ఆనందబాబుకు శుభాకాంక్షలు చెబుతున్న సుందరరావు

ఆనందబాబుకు శుభాకాంక్షలు

ప్రజాశక్తి - వేమూరు

టిడిపి అభ్యర్థిగా 4వ సారి మాజీ మంత్రి నక్క ఆనందబాబుకు సీటు కేటాయించటం పట్ల ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కనపర్తి సుందర్రావు అభినందనలు తెలిపారు. రాష్ట్రంలో నియోజకవర్గ పునర్విభజన అనంతరం వేమూరును ఎస్సీలకు కేటాయించడంతో మొదటి, రెండు విడతలు ఆనందబాబు పోటీ చేసి గెలుపొందటమే కాక 2వ విడత సాంఘిక సంక్షేమ శాఖ మంత్రిగా పనిచేసి రాష్ట్రంలో దళితకు ప్రత్యేక స్థానాన్ని కల్పించారని అన్నారు. దళితులకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి దళితుల మనసులో స్థానాన్ని సంపాదించారని కొనియాడారు. ప్రస్తుతం రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలన కొనసాగుతుందని అన్నారు. దీని పట్ల విసుకు చెందిన ప్రజలు ఆనందబాబు గెలుపు కోసం ఎదురు చూస్తున్నారని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు వైసిపి పట్ల పూర్తి వ్యతిరేకతతో ఉన్నారని అన్నారు. దానిని ప్రజలంతా ఓటు రూపంలో తెలియజేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు సుందరరావు పేర్కొన్నారు. ఆనంద బాబు గెలుపు తధ్యమని ఆశ భావం వ్యక్తం చేశారు.

ఇద్దరు ఉపాధ్యాయుల సస్పెన్షన్

ప్రజాశక్తి - పర్చూరు

మండలంలోని చెరుకూరు ఎకెఎంఆర్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాల్లో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు ఉపాధ్యాయులను కరస్పాండెంట్ పత్రా యూలి సస్పెండ్ చేశారు. విధినిర్వహణలో అలసత్వం వహించిన ఉపాధ్యాయులు సిహెచ్ వెంకటేశ్వర్లు, కె పద్మావతమ్మను ఈనెల 22న సస్పెండ్ చేసినట్లు ఆయన తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. గతంలో ఇద్దరు ఉపాధ్యాయులకు వివరణ కోరుతూ పలుమార్లు మెమోలు జారీ చేసినప్పటికీ స్పందించలేదని, అందుకే సస్పెండ్ చేసినట్లు వివరించారు. విధుల నుండి తొలగించిన అనంతరం తమను పాఠశాల్లోకి అనుమతించాలని ఉపాధ్యాయులు గేటువద్దే కూర్చొని తనను ఇబ్బంది పెడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

27 నుంచి టెట్ ఆన్‌లైన్ పరీక్షలు

ప్రజాశక్తి - బాపట్ల

ఉపాధ్యాయ అర్హతకు ఆన్‌లైన పరీక్షలు ఈనెల 27 నుండి మార్చి 6 వరకు టెట్ (టీచర్ ఎలిజిబుల్ టెస్ట్) పరీక్షలు జరుగుతాయని డిఇఓ కె నారాయణరావు ఆదివారం తెలిపారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు హాల్ టికెట్లు పొందుపరిచిన పరీక్ష కేంద్రాల్లోనే ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. ఉదయం 9.30గంటల నుండి 12.00గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2.30గంటల నుండి 5.00గంటల వరకు టెట్ పరీక్షలు జరుగుతాయని తెలిపారు.

గ్రూప్-2 పరీక్షలపై ఎఎస్‌పి పర్యవేక్షణ

పరీక్షలు పర్యవేక్షిస్తున్న ఎఎస్‌పి మహేష్

ప్రజాశక్తి - వేటపాలెం

గ్రూప్ 2 పరీక్షలు జిల్లా వ్యాప్తంగా ప్రశాంత వాతావరణంలో జరిగినట్లు అడిషనల్ ఎస్పీ పి మహేష్ తెలిపారు. మండలంలోని సెయింట్ ఆన్స్ ఇంజనీరింగ్ కళాశాల్లో జరుగుతున్న గ్రూప్ 2 పరీక్షల బందోబస్తును ఆయన పరిశీలించారు. సెయింట్ ఆన్స్ ఇంజనీరింగ్ కళాశాల్లో 1000 మందికి గాను 130మంది, సిఇసిలో 500మందికి 56 మంది గైరహాజరైనట్లు రూట్ ఆఫీసర్ రాజా దిబోరా తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చీరాల రూరల్ సీఐ నిమ్మగడ్డ సత్యనారాయణ భద్రతా చర్యలు చేపట్టారు. అభ్యర్థులకు వసతులు కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ జి సురేష్ పాల్గొన్నారు.

చెరుకుపల్లి : గ్రూప్2 స్క్రీనింగ్ పరీక్షకు మండలంలో ఐదు సెంటర్లను ఏర్పాటు చేశారు. కావూరు జూనియర్ కళాశాల, గుల్లపల్లి ఎన్‌ఆర్‌ఐ జూనియర్ కళాశాల, పొన్నపల్లి శివాని, గీతం కళాశాల, కనగాల బీఈడీ కళాశాల్లో పరీక్ష నిర్వహించారు. ఐదు సెంటర్లలో 1350 మందికి 1090 మంది హాజరయ్యారని, 260మంది గైర్ హాజరయ్యారని రూట్ ఆఫీసర్లు బి సురేష్, విలియం తెలిపారు. ఏటువంటి సంఘటనలు జరగకుండా ఎస్ఐ వై సురేష్ బందోబస్తు నిర్వహించారు.

చెరుకుపల్లిలో ఐదు సెంటర్లలో గ్రూప్ 2 స్క్రీనింగ్ పరీక్ష

విద్యార్థులకు బహుమతులు పంపిణీ

ప్రజాశక్తి - చెరుకుపల్లి

మండలంలోని గుల్లపల్లి జెడ్‌పి ఉన్నత పాఠశాల 42వ వార్షికోత్సవ వేడుకల్లో సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ ద్వారా విద్యార్థుల్లో స్నేహభావం, పోటీ తత్వం, మానసిక దృఢత్వం అలవడుతాయని, తద్వారా విద్యార్థుల భవిష్యత్తుకు మేలు చేకూరుతుందని వైసీపీ ఇన్చార్జి డాక్టర్ గణేష్ అన్నారు. వార్షికోత్సవ సభలో ఆయన మాట్లాడారు. వివిధ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. నేటికి 42ఏళ్లుగా ఎందరో విద్యార్థులకు భవిష్యత్తు అందించిన పాఠశాల విద్యార్థులు ప్రపంచ వ్యాప్తంగా వివిధ స్థాయిల్లో అభివృద్ధి చెందారని అన్నారు. వారందరికీ విద్యా బుద్ధులు నేర్పిన పాఠశాల ప్రస్తుతం కళాశాల స్థాయికి అభివృద్ధి చెందిందని అన్నారు. భవిష్యత్తులో మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. డాక్టర్ గణేష్ విద్యార్థులతో కలిసి ఉత్తేజపర్చారు. కార్యక్రమంలో జడ్పిటిసి మత్రివాడ వెంకట పావని ప్రసాద్, మాజీ ఎంపిపి చెన్ను కోటేశ్వరరావు, ఎంపిటీసీ దేవరపల్లి అమరేంద్ర, విద్యా కమిటీ చైర్మన్ మంచాల విజయ్ కిషోర్ బాబు, హెచ్‌ఎం కోనేటి వనిత పాల్గొన్నారు.

పాఠశాల వార్షికోత్సవ సభలో వైసిపి ఇన్చార్జి డాక్టర్ గణేష్

రాష్ట్ర విభజన హామీలు అమలు చేయాలి

ప్రజాశక్తి - చీరాల

ఆంధ్ర రాష్ట్రం విడిపోయి ప్రత్యేకంగా ఏర్పడి పదేళ్లయినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆనాటి విభజన హామీలు నేటికీ పరిష్కరించక పోగా తాత్సారం చేస్తూ వస్తున్నారని నవ్యాంధ్ర చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు కోట వెంకటేశ్వర రెడ్డి పేర్కొన్నారు. స్థానిక సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశానికి సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎ రామారావు అధ్యక్షత వహించారు. 2014 విభజన హామీలైన ప్రత్యేక హెూదాను పాలకులు మరిచారని ఆవేదన వ్యక్తం చేశారు. పదేళ్లు ప్రత్యేక హెూదా కల్పిస్తామన్న బీజేపీ అధికారంలోకి వచ్చాక ఆ ఊసే ఎత్తటం లేదని అన్నారు. ప్రత్యేక హెూదా వస్తే కంపెనీలు వస్తాయని అన్నారు. అధికార, ప్రతిపక్ష పార్టీలు హెూదాపై మాట్లాడకపోవడం విచారకరమని అన్నారు. కేంద్రం, రాష్ట్రం ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ కాలయాపన చేస్తున్నారని అన్నారు. సమావేశంలో బక్క జయరామిరెడ్డి, వెన్నెలకంటి శర్మ, నాగేశ్వరావు, కూరపాటి నారాయణ, మేడ వెంకట్రావు, పి రామస్వామి, మణి బాబు, రంగా హనుమంతరావు, ఎన్ రంగారావు, ఎం కోటేశ్వరావు, పి విజయ భాస్కరరెడ్డి, కె ప్రసాదరావు, వి జగన్మోహన్‌రావు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వరరెడ్డి

టిడిపిలో చేరిన కార్యకర్తలతో ఆనందబాబు

వైసీపీ నుంచి టిడిపిలో చేరిక

ప్రజాశక్తి - వేమూరు

అమృతలూరు మండలం బోడపాడు, ప్యాపరు, పెదపూడి గ్రామాలకు చెందిన 30వైసిపి కుటుంబాలు ఆదివారం టిడిపిలో చేరారు. వీరికి మాజీ మత్రి నక్కా ఆనందబాబు టిడిపి కండువా కప్పి టిడిపిలోకి సాదరంగా ఆహ్వానించారు. వైసిపి పాలనలో సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చేస్తున్న అరాచకాలు, అభివృద్ధి నిరోధక చర్యల పట్ల టిడిపిలో పనిచేయాలని నిశ్చయించుకున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి టిడిపి ద్వారా సిఎం చంద్రబాబుతోనే సాధ్యమవుతుందని అన్నారు. వైసీపీ నుండి టిడిపిలో చేరిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక గుర్తింపు ఉంటుందని అన్నారు. రానున్న ఎన్నికల్లో టిడిపి గెలిచే లక్ష్యంగా అందరం కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. జనసేన, టిడిపి సమన్వయంతో చంద్రబాబును సిఎంగా గెలిపించుకొనేందుకు కృషి చేయాలని కోరారు.

వైసీపీ కండువ కప్పుతున్న అశోక్ బాబు

అశోక్ సమక్షంలో వైసీపీలో చేరిక

ప్రజాశక్తి - భట్టిప్రోలు

స్థానిక రైలుపేట, పెద మాలపల్లికి చెందిన సుమారు 15 టిడిపికి చెందిన కుటుంబాలు వైసిపి ఇన్చార్జి వరికుటి అశోక్ బాబు సమక్షంలో వైసిపిలో చేరారు. సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వైసీపీలో పని చేయాలని నిశ్చయించుకున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారికి వైసిపి కండువాలు కప్పి వైసిపిలోకి ఆహ్వానించారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం ముందుకు కొనసాగాలంటే మరోసారి జగన్మోహన్‌రెడ్డిని సిఎంగా గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. వైసిపిలో చేరిన ప్రతి ఒక్కరికి సముచిత స్థానం కల్పిస్తామని అన్నారు. వైసిపి గెలుపుకు కృషి చేయాలని అన్నారు.

కార్యకర్తలతో మాట్లాడుతున్న యడం బాలాజీ

సమస్యలపై స్పందించిన బాలాజీ

ప్రజాశక్తి - పర్చూరు

వైసీపీ నియోజకవర్గ ఇంచార్జి యడం బాలాజీ ఆదివారం తన కార్యాలయంలో అందుబాటులో ఉన్నారు. పలువురు నాయకులు, కార్యకర్తలు ఆయన్ని కలిసి సమస్యలు విన్నవించారు. వెంటనే పరిష్కరిస్తానని ఆయన భరోసా ఇచ్చారు. ఆయన్ను కార్యాలయంలో కలిసిన వారిలో కారంచేడు ఎంపిపి నీరుకట్టు వాసుబాబు, మాజీ ఎంపిపి కొల్లా వెంకట్రావు, గాజుల రమేష్, దాసరి వెంకటరావు, షేక్ కాలేష, కొట్టే ప్రభుదాసు, ద్రోణాదుల సర్పంచ్ భాగ్యరావు, కంచెనపల్లి రమేష్, గాదె సురేష్, జంగా అనిల్, ఆకుల హేమంత్, వైసిపి మార్టూరు మండల అధ్యక్షులు పఠాన్ కాలేష ఉన్నారు.

శానంపూడిలో మంత్రి సురేష్ పర్యటన

ప్రజాశక్తి-శింగరాయకొండ

మండలంలోని శానంపూడిలో రాష్ట్ర పురపాలక పట్టణ అభివృద్ధి శాఖ మంత్రి, వైసిపి కొండపి ఇన్‌ఛార్జి ఆదిమూలపు సురేష్ ఆదివారం రాత్రి పర్యటించారు. కార్యక్రమంలో భాగంగా మొదటగా యానాది కాలనీలో గ్రామ నాయకులు మంత్రికి ఘన స్వాగతం పలికారు. అనంతరం అక్కడ ఏర్పాటుచేసిన సమావేశంలో మంత్రి సురేష్ కాలనీవాసులను ద్దేశించి ప్రసంగించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బల్లెకూర బ్రహ్మయ్య, మసనం వెంకట్రావు, ఎంపీటీసీ ఆది పోగు సుమతి, మాదాల శంకర్రావు, మాదాల నారాయణ, రావినూతల అంకయ్య, మండల పార్టీ అధ్యక్షులు సామంతుల రవికుమార్ రెడ్డి, యన్నాబత్తిన చిన్నా, చుక్కా కిరణ్, శీలం రాము పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మంత్రి సురేష్

'సివిఎన్ క్లబ్' ఎన్నికల అధికారుల నియామకం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

పాలకవర్గ కమిటీ పదవీకాలం ముగియటంతో సజావుగా ఎన్నికలు నిర్వహించేందుకు సీనియర్ క్లబ్ సభ్యులైన బేతంశెట్టి హరిబాబు, తోట రామస్వామిలను ఎన్నికల అధికారులుగా నియమిస్తూ జనరల్ బాడీ తీర్మానించింది. సివిఎన్ రీడింగ్ రూమ్ అండ్ క్లబ్ లో ఆదివారం ఉదయం జనరల్ బాడీ మీటింగ్ జరిగింది. తమ పదవీ కాలంలోని జమా ఖర్చుల వివరాల నివేదికను క్లబ్ సెక్రటరీ మొగిలిపువ్వు సత్యనారాయణ సభ్యులకు వెల్లడించారు. కోవిడ్ కారణంగా మరికొంత కాలం పాలకవర్గ కమిటీ కొనసాగిందని, తమ హయాంలో క్లబ్ లో అనేక అభివృద్ధి కార్యక్రమాలకు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని ఆయన తెలిపారు. వారికి క్లబ్‌కి సంబంధించిన అన్ని రికార్డులను పాలకవర్గం అందజేసిందన్నారు. ఇంతకాలం తమను ఆదరించిన క్లబ్ సభ్యులందరికీ కమిటీ సభ్యులు తమ కతజ్ఞతలు తెలియజేశారు సమావేశంలో సివియన్ పాలకవర్గ కమిటీ అధ్యక్షులు తాతా శ్రీనివాసులు, కోశాధికారి రామిరెడ్డి నితిన్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు కుర్రా ప్రసాద్ బాబు, బూచి వనమాలి, ఉన్నవ శేషుబాబు, యేసుపోగు ఏసుదాసు, తిరుమలశెట్టి శ్రీరామమూర్తి, మేనేజర్ శివారెడ్డి, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

'జయహో బీసీ'ని జయప్రదం చేయండి

టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు దామచర్ల జనార్ధనరావు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఆదేశాల మేరకు ఒంగోలు పార్లమెంట్ స్థాయి 'జయహో బీసీ' కార్యక్రమం ఒంగోలు నగరంలోని బందావన్ ఫంక్షన్ హాలులో సోమవారం ఉదయం 10 గంటలకు జరుగుతుందని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు తెలిపారు. ఒంగోలు నియోజకవర్గ స్థాయిలోని రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ, అనుబంధ విభాగాల బీసీ కమిటీలలోని సభ్యులు, బిసి నాయకులు, బిసి సాధికార సమితి రాష్ట్ర, జిల్లా కమిటీ సభ్యులు, కార్యకర్తలు, మహిళలు, అందరూ పాల్గొని జయహో బీసీ సభను విజయవంతం చేయాలని కోరారు.

27, 28 తేదీల్లో ఎంపీ మాగుంట పర్యటన

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి ఈనెల 27, 28 తేదీలలో పలు కార్యక్రమాలలో పాల్గొననున్నారు. ఈ నెల 27న ఉదయం 8 గంటలకు ఒంగోలు మాగుంట కార్యాలయంలో కార్యకర్తలకు అందుబాటులో ఉంటారు. 11 గంటలకు ఒంగోలులో స్థానికంగా జరిగే కార్యక్రమాలకు హాజరవుతారు. మధ్యాహ్నం 1 గంటకు ఒంగోలు మాగుంట కార్యాలయంలో కార్యకర్తలకు అందుబాటులో ఉంటారు. సాయంత్రం ఐదు గంటలకు ఒంగోలులో స్థానికంగా జరిగే కార్యక్రమాలకు హాజరవుతారు. రాత్రి 7 గంటలకు ఒంగోలు మాగుంట కార్యాలయంలో కార్యకర్తలకు అందుబాటులో ఉంటారు. ఈ నెల 28న ఒంగోలు మాగుంట కార్యాలయంలో కార్యకర్తలకు అందుబాటులో ఉంటారు. 11.30 గంటలకు ఒంగోలు ఎల్వీవ్ హోటల్లో కొత్తగా నిర్మించిన కళ్యాణ మండపం ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం ఒంటి గంటకు ఒంగోలు మాగుంట కార్యాలయంలో కార్యకర్తలకు అందుబాటులో ఉంటారు.

ఎన్నికల్లో అక్రమాల కట్టడికి కఠినంగా వ్యవహరించాలి

నేషనల్ లోకల్ గవర్నమెంట్స్ ఛాంబర్ వీరభద్రాచారి డిమాండ్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రధానమైన ఎన్నికల ప్రక్రియ నిజాయతీగా, నిష్పక్షపాతంగా జరిగినప్పుడే ప్రజాస్వామ్యం విజయవంతమవుతుందని నేషనల్ లోకల్ గవర్నమెంట్స్ ఛాంబర్ జాతీయ ప్రధాన కార్యదర్శి జి. వీరభద్రాచారి అభిప్రాయపడ్డారు. ఆదివారం సంస్థ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించడానికి ఎన్నికల సంఘం తనకున్న విస్తత అధికారాలు వినియోగించడంతో పాటు అక్రమార్కుల పట్ల చట్టబద్ధంగా కఠిన వైఖరితో వ్యవహరించాలన్నారు. అవసరమైతే కొత్త సంస్కరణలు ప్రవేశపెట్టి రాజకీయ పార్టీలు, వ్యక్తుల మూకుమ్మడి స్వార్థ పూరిత చర్యలను కట్టడి చేయాలన్నారు మ్యానిఫెస్టోల విడుదలలో ప్రజలను మభ్యపెట్టడం, ఓటర్లను ప్రలోభపెట్టే తీరును గమనించి కట్టడి చేయాలన్నారు. మంత్రులు, ముఖ్యమంత్రులుగా ప్రజాధనంతో, ప్రభుత్వ లాంఛనాలతో తమ పార్టీ పేరుతో బహిరంగ సభలు ఏర్పాటు చేయడం వంటి అంశాలపై దష్టిపెట్టాలని డిమాండ్ చేశారు. గత ఎన్నికల మానిఫెస్టో అమలు తీరుపై సంబంధిత పార్టీల స్థితిగతులు ఎన్నికలసంఘం పరిశీలించాలన్నారు. కొత్త ఓట్ల చేర్పులు, మార్పులు, తొలగింపులు వంటి విషయాలలో పార్టీల ప్రత్యక్ష, పరోక్ష జోక్యాలు, వారికి సహకరిస్తున్న ప్రభుత్వ శాఖల ఉద్యోగులపై క్రమశిక్షణా చర్యలు ఉండాలన్నారు.

ప్రశాంతంగా గ్రూప్-2 పరీక్షలు

- కలెక్టర్ దినేష్ కుమార్ - పలు కళాశాల్లో కలెక్టర్, జెసి పరిశీలన

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలో ఎపిపిఎస్‌సి గ్రూప్-2 ప్రిలిమినరీ పరీక్ష ప్రశాంతంగా జరిగిందని కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కాలేజీ, శ్రీహర్షిణి కాలేజీలను తనిఖీ చేశారు. పరీక్షలు రాస్తున్న అభ్యర్థులకు కల్పించిన సదుపాయాలను, భద్రతా ఏర్పాట్లను, సి.సి.టి.వి.ల ద్వారా నిఘా, పోలీసు బందోబస్తు వంటి అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో మొత్తం 49 కేంద్రాలలో ఎపిపిఎస్‌సి గ్రూప్-2 ప్రాథమిక పరీక్ష నిర్వహించినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. పరీక్ష కేంద్రాల్లోనికి ఎటువంటి సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు అనుమతించలేదన్నారు. పరీక్షా కేంద్రాల్లో కూడా పరీక్ష జరిగే సమయంలో ఇంటర్ నెట్ నిలిపివేయడం జరిగిందన్నారు. జిల్లాలోని అన్ని కేంద్రాల్లో పరీక్ష సమయానికి ప్రారంభమైందని, ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు లేకుండా పరీక్ష సజావుగా నిర్వహించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెంట రూట్ ఆఫీసర్ పి.వెంకటేశ్వర్లు, ఇతర అధికారులు ఉన్నారు. అదేవిధంగా సంయుక్త కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ క్విస్ ఇంజినీరింగ్ కళాశాల, రైజ్ ఇంజినీరింగ్ కళాశాల, పేస్ ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన గ్రూప్-2 పరీక్షలను తనిఖీ చేశారు. అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఆదివారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగిన గ్రూప్- 2 పరీక్షలకు మొత్తం 21,565 మంది అభ్యర్థులు కేటాయించగా, అందులో 17,860 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. 3705 మంది అభ్యర్థులు పరీక్షలకు గైర్హాజరు అయ్యారు. ఒంగోలు నగరంలోని పలు కేంద్రాలను జిల్లా ఎస్పి పి.పరమేశ్వర రెడ్డి పరిశీలించారు. బందోబస్తు పటిష్టంగా ఏర్పాటు చేయాలని జిల్లా ఎస్పి పోలీస్ అధికారులకు సూచించారు.

బాపట్లలో పరీక్ష రాసేందుకు వెళుతున్న విద్యార్థులు

మానవత్వాన్ని చాటిన పోలీసు సిబ్బంది

ఒంగోలు మాంటిస్సోరి స్కూల్లో గ్రూప్-2 ప్రిలిమ్స్ పరీక్షలు రాయడానికి వచ్చిన ఇద్దరు వికలాంగుల పట్ల అక్కడ విధులు నిర్వహిస్తున్న సంతనూతలపాడు పోలీస్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ ఎం శ్రీనివాసరావు, మహిళా హోంగార్డు పివి రమణమ్మ మానవత్వాన్ని చూపారు. మరొకరి సాయంతో పరీక్ష రాయడానికి వచ్చిన వికలాంగ యువకుడిని హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు చేయిపట్టి నడిపించి.. పరీక్షా కేంద్రంలోకి తీసుకెళ్లారు. మహిళా హోంగార్డు రమణమ్మ వికలాంగురాలైన యువతిని ఎత్తుకొని పరీక్షా కేంద్రంలోకి చేర్చారు. వీరిని పలువురు అభినందించారు.

బాపట్ల: గ్రూప్- 2 ప్రిలిమినరీ పరీక్షలు ఆదివారం బాపట్ల జిల్లాలో ప్రశాంతంగా ముగిశాయి. ఈ పరీక్షలకు జిల్లాలో 25 పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేశారు. జిల్లావ్యాప్తంగా 7661 మంది గ్రూప్-2 పరీక్షలకు హాజరు కావాల్సి ఉంది. వీరిలో 6282 మంది మాత్రమే హాజరయ్యారు. అయితే 1389 మంది అభ్యర్థులు గైర్హాజరైనట్లు జిల్లా పరిషత్ నిర్వహణ అధికారి సంయుక్త కలెక్టర్ శ్రీధర్ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఏర్పాటు చేసిన 11 రూట్లలో 25 పరీక్ష కేంద్రాలను జె సి శ్రీధర్, ఆర్ డి ఓ గంధం రవీందర్, జిల్లా వత్తివిద్య ఇంటర్మీడియట్ అధికారి ఎర్రయ్య పరిశీలించారు. జిల్లా కేంద్రమైన బాపట్లలో బాపట్ల ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, వ్యవసాయ కళాశాల, బాపట్ల పబ్లిక్ స్కూల్ ల్లో గ్రూప్ -2 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటుచేశారు.

వసతిగృహాల్లో మెరుగైన సదుపాయాలు

- పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

- జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మానాయక్

ప్రజాశక్తి-ఒంగోలు, యర్రగొండపాలెం

జిల్లాలో సాంఘిక సంక్షేమ వసతి గృహాలు మెరుగైన సదుపాయాలు కల్పిస్తున్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎన్ లక్ష్మానాయక్ తెలిపారు. బయోమెట్రిక్ విధానం వల్ల హాస్టళ్ల సిబ్బంది సక్రమంగా విధులకు హాజరవుతున్నారు. పదోతరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెడుతున్నామంటున్న ఆయన 'ప్రజాశక్తి' ముఖాముఖి..

జిల్లావ్యాప్తంగా 81 సాంఘిక సంక్షేమ వసతిగృహాలున్నాయి. వాటిలో ప్రీ మెట్రిక్ వసతిగృహాలు 61 ఉన్నాయి. ఆ వసతి గృహాల్లో మూడో తరగతి నుంచి పదో తరగతి చదివే విద్యార్థులకు వసతి సౌకర్యం కల్పిస్తున్నాం. ప్రస్తుతం ఆ వసతి గృహాల్లో 5600 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. అలాగే 20 పోస్టు మెట్రిక్ వసతి గృహాలున్నాయి. వాటిలో ఇంటర్ నుంచి పీజీ వరకు చదివే విద్యార్థులు వసతి సౌకర్యం పొందుతున్నారు. ప్రస్తుతం పోస్టుమెట్రిక్ వసతి గృహాల్లో రెండు వేల మంది విద్యార్థులు వసతి పొందుతూ విద్యనభ్యసిస్తున్నారు. 81 వసతిగృహాలకు గానూ 49 వసతిగృహాలకు ప్రభుత్వ భవనాలున్నాయి. మిగతావి ప్రైవేటు భవనాల్లో నడుస్తున్నాయన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలలను నాడు-నేడు పథకం ద్వారా ఏ విధంగా అభివృద్ధి చేశారో అదే విధంగా సాంఘిక సంక్షేమ వసతిగృహాల్లో సైతం రూపురేఖలు మారాయి. విద్యార్థులకు అన్ని సౌకర్యాలూ కల్పించడంతో పాటు మెరుగైన ఫలితాలు సాధించేందుకు విశేషంగా కృషి చేస్తున్నామన్నారు.

విద్యార్థులకు కాస్మోటిక్ ఛార్జీలు..

గతంలో మాదిరి కాకుండా విద్యార్థులకు కాస్మోటిక్ ఛార్జీలను సెప్టెంబర్ వరకు వారి తల్లుల ఖాతాల్లో జమ చేశాం. మిగతా నెలల కాస్మోటిక్ ఛార్జీ బిల్లుల మంజూరుకు ప్రభుత్వానికి నివేదిక అందించాం. అవి రాగానే వాటిని కూడా పంపిణీ చేస్తాం. మెస్ ఛార్జీల విషయానికి వస్తే గతంలో ఉన్న ఛార్జీల కంటే ఇప్పుడు కొంత మేర పెరిగాయి. వాటివల్ల ప్రభుత్వం ఇచ్చిన మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నాం. మెనూ పాటించని సంక్షేమాధికారులపై చర్యలు తీసుకుంటున్నాం. ప్రతిరోజూ మెనూ అందించే క్రమంలో ఫొటోలు తీసి అప్‌లోడ్ చేయిస్తున్నాం. దీంతో ఎక్కడా మెనూ పక్కదారి పట్టే అవకాశం లేకుండా గట్టి ఏర్పాట్లు చేశాం.

బయోమెట్రిక్ తప్పనిసరి..

వసతిగృహాల్లో సిబ్బందికి బయోమెట్రిక్ విధానాన్ని తప్పనిసరి చేశాం. దాని ద్వారా ఏ అధికారి విధులకు హాజరు కాలేదో వెంటనే ఉన్నతాధికారుల దష్టికి వెళ్తుంది. ఈ తరుణంలో సిబ్బంది హాజరుపై సంజాయిషీ ఇవ్వాల్సి ఉంది. ఈ విధానంతో సిబ్బంది వందశాతం విధులకు హాజరవుతున్నారు. ఈ విషయంలో వసతి గృహ సంక్షేమాధికారికి కూడా ఎలాంటి మినహాయింపు లేదు.

సిబ్బందికి క్రమం తప్పకుండా వేతనాలు..

సాంఘిక సంక్షేమ వసతిగృహాల్లో పనిచేస్తున్న సిబ్బందికి ప్రతినెలా వేతనాలు ఒకటో తేదీన క్రమం తప్పకుండా అందేలా చర్యలు తీసుకుంటున్నాం. గతంలో పని చేసే ప్రైవేటు సిబ్బందిని సర్వీసు ఉద్యోగులుగా పరిగణించాం. వారు 212 మంది దాకా ఉన్నారు. వారికి 2019 నుంచి 2022 మధ్య కాలంలో పాత బకాయిలు రూ.కోటి ఆరు లక్షలు రావాల్సి ఉంది. వాటి మంజూరు కోసం ప్రతిపాదనలు పంపాం. ప్రస్తుతం వారి బకాయిల వ్యవహారం రిజర్వు బ్యాంకు పరిధిలో ఉంది. నిధులు మంజూరు కాగానే పంపిణీ చేస్తాం.

ముఖాముఖి

పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి..

సాంఘిక సంక్షేమ వసతిగృహాల్లో ఈ ఏడాది 973 మంది విద్యార్థులు పదో తరగతి విద్యను అభ్యసిస్తున్నారు. వారందరికీ నాలుగు సబ్జెక్టుల్లో ట్యూటర్లను ఏర్పాటు చేశాం. వసతి గృహాల్లో ప్రత్యేక క్లాసులు నిర్వహిస్తున్నాం. వందకు వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేస్తున్నాం.

వసతి గృహాల అభివృద్ధికి చర్యలు..

ఇటీవలనే కొత్తపట్నంలోని బాలికల వసతి గృహానికి జీవీఆర్ గ్రూపు వారు రూ.11.50 లక్షలతో మంచాలు, ఫ్యాన్లు తదితర సౌకర్యాలు కల్పించారు. యర్రగొండపాలెంలోని కాలేజీ బాలికల వసతి గృహంలో 2016-17లో 12 మంది విద్యార్థులు ఉండేవారు. అన్ని సౌకర్యాలు ఉన్న భవనంలోకే దానిని మార్చడంతో ప్రస్తుతం 220 మంది బాలికలు వసతి గృహంలో ఉండి విద్యను అభ్యసిస్తున్నారు. అలాగే కంభం కాలేజీ బాలికల వసతి గృహంలో కూడా 12 మంది విద్యార్థులు ఉండగా ప్రస్తుతం వంద మంది విద్యార్థులు ఉన్నారు. గిద్దలూరులోనూ అదే విధంగా ఎక్కువ మంది విద్యార్థులు చేరి విద్యను అభ్యసిస్తున్నారు. సాంఘిక సంక్షేమ వసతి గృహాల అభివృద్ధికి ప్రభుత్వం ఎన్నో చర్యలు చేపట్టింది.